PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 300 | విజయవాడ, మంగళవారం 4 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 4 June 2024 | Rs

దక్షిణాఫ్రికా గెలుపు

- నోర్ట్జే దెబ్బకు శ్రీలంక ధమాల్
- 77 పరుగులకు ఆలౌట్
- టి20ల్లో అత్యల్ప స్కోర్

• లోపలి పేజీలో..

జులై 28న గ్రూప్-2 పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-2 ప్రధాన పరీక్షలు జులై 28న నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) వెల్లడించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆఫ్‌లైన్ విధానంలో ఉదయం, సాయంత్రం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. డిసెంబరు 7న 897 గ్రూప్-2 పోస్టులకు ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 10న జరిగిన స్క్రీనింగ్ పరీక్షలో 92,950 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ప్రధాన పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ జూం౨.ఖజూ.స్త్రశీజ.ఱఅలో పరీక్ష కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు పోస్ట్, జోనల్, జిల్లాల ఆధారంగా ఆప్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు.

మరికొన్ని గంటల్లో ...

ఉత్కంఠకు తెర

కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు : సిఇఓ

ఉదయం 8 గంటలకు ప్రారంభం

రెడ్‌జోన్‌గా కౌంటింగ్ సెంటర్ల పరిసరాలు

ఏజెంట్లకు బ్రీత్ ఎనలైజర్ టెస్టు • మద్యం దుకాణాలు బంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. మరికొన్ని గంటల్లోనే ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. కేంద్రంలోనూ, రాష్ట్రం లోనూ అధికారపగ్గాలు ఎవరు చేపట్టనున్నా రన్నది తేలిపోనుంది. రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాల ఫలితాలను వెల్లడించడానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. మీడియా ప్రతినిధులతో సోమ వారం మాట్లాడిన ఆయన ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు 119 మంది అబ్జర్వర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 3.33 కోట్ల ఓట్లను లెక్కించనున్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులదే తుది నిర్ణయమని ఆయన చెప్పారు. కౌంటింగ్ కోసం పార్లమెంటు నియోజకవర్గాలకు 2,442 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లకు 443 టేబుళ్లు, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం 2,446 టేబుళ్లు పోస్టల్ బ్యాలెట్‌కు 557 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు సిఇఓ తెలిపారు. . ప్రతి టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమిస్తున్నామని, పదిశాతం మంది సిబ్బందిని రిజర్వులో ఉంచుతున్నట్లు చెప్పారు.

గుంటూరు నాగార్జున యూనివర్శిటీ వద్ద ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లు

కొవ్వూరు, నరసాపురంల నుండి తొలి ఫలితం

కొవ్వూరు, నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గాల నుండి రాష్ట్రంలో తొలి ఫలితం వెలువడనుంది. ఈ నియోజకవర్గాల్లో 13 రౌండ్లు మాత్రమే లెక్కించాల్సిఉండటం దీనికి కారణం. భీమిలి, పాణ్యం నియోజకవర్గాల్లో 26 రౌండ్ల లెక్కింపు జరగనుంది. ఈ నియోజకవర్గాల ఫలితాలు చిట్టచివరన రావొచ్చని భావిస్తున్నారు. అమలాపురం పార్లమెంటు నియోజకవర్గంలో 27 రౌండ్లు లెక్కించనున్నారు. దీనికోసం తొమ్మిది నుండి పది గంటల సమయం పట్టనుంది. అలాగేరాజమండ్రి, నరసాపురం పార్లమెంటు మిగతా 2లో

'పిన్నెల్లి'కి కౌంటింగ్ హాల్‌లోకి నో ఎంట్రీ

- సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించొద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇవిఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పించడాన్ని సవాల్ చేస్తూ టిడిపి ఏజెంట్ నంబూరి శేషగిరిరావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జె కుమార్ వాదనలు వినిపిస్తూ.. పిన్నెలికి బెయిల్ ఇస్తూ దిగువకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కోర్టులో ప్రదర్శించారు. దీనిపై పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది వికాష్‌సింగ్ వాదనలు వినిపిస్తూ., అధికారిక వీడియో కాదని అన్నారు. నంబూరి శేషగిరిరావు తరపున న్యాయవాది జె మెహతా జోక్యం చేసుకుని ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు కూడా ఉన్నాయని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఇవిఎం ధ్వంసం చేసిన వ్యక్తికి ముందస్తు బెయిల్ ఇవ్వడమేంటని హైకోర్టును ప్రశ్నించారు. కౌంటింగ్ హాలులోకి పిన్నెలిని అనుమతించవద్దని, జూన్ ఆరున బెయిల్ పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టును ధర్మాసనం ఆదేశించింది.

పాలస్తీనా సంఘీభావ సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో రామకృష్ణ తదితరులు

రఫాపై దాడులు నిలిపేయాలి

ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించాలి

- మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో దోస్తీ మానుకోవాలి
- పాలస్తీనా స్వాతంత్రకాంక్షకు కేంద్ర ప్రభుత్వం మద్దతును ప్రకటించాలి
- సంఘీభావ సదస్సులో వామపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రఫాలో నిర్వాసితులు తలదాచుకుంటున్న శిబిరాలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాష్టీకాన్ని వామపక్షపార్టీలు తీవ్రంగా ఖండించాయి. పాలస్తీనా ప్రజల స్వతంత్ర దేశ కాంక్షకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇజ్రాయిల్‌తో మోడీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దౌత్యసంబంధాలను తక్షణం నిలిపేయాలని డిమాండ్ చేశాయి. సోమవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో వామపక్షపార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సదస్సు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో రఫాపై దాడులను తక్షణమే నిలిపేయాలని, ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ప్రకటించాలని, భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఆయుధాల ఎగుమతులను ఆపాలని, పాలస్తీనాపై ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న దుష్ప్రచారంపై ప్రజల్లో అవగాహనను పెంచేందుకు కార్యక్రమాన్ని చేపట్టాలని వి శ్రీనివాసరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మూర్తి, ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు సుధీర్‌లతో పాటు సదస్సుకు ప్రత్యక్షంగా హాజరుకాలేక పోయిన యంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్), సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ, ఫార్వర్డ్‌బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీలు ఈ తీర్మానాలను బలపరుస్తున్నట్లు తమ సందేశాన్ని పంపాయి. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలస్తీనా, ఇజ్రాయిల్ వ్యవహారం ఒంటె కథను గుర్తుకుతెస్తోందన్నారు. జర్మనీ నియంత హిట్లర్ యూదులపై సాగించిన దమనకాండతో ప్రపంచదేశాల విజ్ఞప్తి మేరకు పాలస్తీనా యూదులకు ఆశ్రయం మిగతా 2లో

జోక్యం చేసుకోలేం

పోస్టల్ బ్యాలెట్ వ్యవహారంపై సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వ్యవహారంపై జోక్యం చేసుకోలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించిన మే 30న ఇచ్చిన నిబంధనలను సవాలు చేస్తూ వైసిపి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపి తోసిపుచ్చింది. వైసిపి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, పోస్టల్ బ్యాలెట్లు ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయని, ఎన్నికల సంఘం ఈ సర్క్యులర్ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల మధ్యలో సర్క్యులర్ ఇచ్చారని, అది కూడా ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వర్తించేలా ఇచ్చారని తెలిపారు. అంత ప్రత్యేకత ఏమిటని ప్రశ్నించారు. ఈ సర్క్యులర్‌తో ఇప్పటివరకు ఉన్న చట్టబద్ధ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది.

పాలు లీటర్‌కు రూ.2 పెంపు

- ప్రకటించిన అమూల్, మదర్ డెయిరీ
- ఖండించిన సిపిఎం, ఐద్వా

• లోపలి పేజీలో..

పాలస్తీనాకు మద్దతు తెలపడమే నేరమా!

- భారత సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకున్న మితవాద మూకలు
- వేధింపులు, బెదిరింపులతో ట్రోలింగ్

పింఛనుదార్ల పడిగాపులు

- కిక్కిరిసిన బ్యాంకులు
- వడదెబ్బకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

సామాజిక పింఛన్ల సొమ్ము బ్యాంకులో జమ చేయడంతో విత్ డ్రా కోసం వృద్ధులు, వికలాంగులకు తిప్పలు తప్పడం లేదు. పింఛను సొమ్ము విత్‌డ్రా చేసేందుకు విజయనగరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు బ్యాంకులకు క్యూ కట్టారు. పింఛనుదారులతో బ్యాంకులు కిక్కిరిసిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు, పెనుమంట్ర, ఆలమూరు, పొలమూరు బ్యాంకుల వద్ద వృద్ధులు అవస్థలు పడ్డారు. నరసాపురం మండలం, పట్టణంలో ఏ బ్యాంకులు చూసినా కిటకిటలాడాయి. జూన్ ఒకటిన వర్షం పడడం, రెండున ఆదివారం, మూడున సోమవారం కావడంతో ఉదయం నుంచే బ్యాంకుల వద్ద పడిగాపులు పడ్డారు. గణపవరం మండలంలోని అర్ధవరం సెంట్రల్ బ్యాంకుకు పింఛనుదారులు చేరుకున్నప్పటికీ బ్యాంకు అధికారులు ఉదయం 11 గంటల వరకూ సొమ్ము అందజేయలేదు. దీంతో బ్యాంకు గేటు బయట వృద్ధులు పడిగాపులు పడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటలో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకుకు పింఛనుదారులు భారీగా తరలి వచ్చారు. దీంతో బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతం కిటకిటలాడింది. జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల నుంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు సీలేరు యూనియన్ బ్యాంకు వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచే బారులు తీరారు.

అల్లూరి జిల్లా సీలేరులో యూనియన్ బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

వడదెబ్బకు వృద్ధుడు మృతి

పింఛను కోసం సచివాలయానికి వెళ్లిన వృద్ధుడు వడదెబ్బకు గురై మరణించారు. చిత్తూరు జిల్లా పుత్తూరు మున్సిపాలిటీ 19వ వార్డు ఆరేటమ్మ ఎస్‌టి కాలనీకి చెందిన కె.కిష్టప్ప (81) తన పింఛను కోసం కల్యాణపురం సచివాలయానికి వెళ్లారు. క్యూలైన్‌లో నిల్చున్న సమయంలో ఎండవేడిమి, వడగాలులు తాళలేక ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులకు సచివాల య సిబ్బంది సమాచారమివ్వడంతో వారు రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.వడదెబ్బకు గురై మరణించినట్లు వైద్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో/శృంగవరపుకోట

విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజ్ సోమవారం అనర్హత వేటు వేశారు. వైసిపి నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎస్.కోటకు చెందిన రఘురాజు భార్య ఇటీవల లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఎస్.కోట వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాస రావు, విశాఖ ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీలను ఓడించాలని ప్రచారం చేశారు. దీనిపై వైసిపి విప్ పి.విక్రాంత్ శాసనమండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రఘురాజును అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. దీనిపై మే 27న వచ్చి వివరణ ఇవ్వాలని రఘురాజుకు ఛైర్మన్ మోషేన్‌రాజు నోటీసు జారీ చేశారు. ఆరోగ్యం బాగోలేదని రఘురాజు సమాధానం ఇవ్వడంతో, 31న వచ్చి వివరణ ఇవ్వాలని మరో నోటీసు పంపారు. దీనికీ స్పందించకపోవడంతో సోమవారం అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించారు.

పోలీసుల డేగ కన్ను!

- నేతల కదలికలను గమనించేందుకు షాడో టీమ్‌లు
- ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఏజెంట్లు, అభ్యర్థులకే అనుమతి



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులపై పోలీసు డేగ కన్ను వేశారు. దీనిలో భాగంగా షాడో పార్టీలను ఏర్పాటు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, వివిధ పార్టీల ముఖ్య నాయకులను ఈ బృందాలు నీడలా వెంటాడతాయి. పోలింగ్ రోజున పల్నాడు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో లెక్కింపు రోజున, అనంతరం ఘర్షణలు జరగకుండా నియంత్రించే క్రమంలో ప్రతి ఒక్కరిపై పక్కాగా నిఘా ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. సంబంధిత నాయకుడి కదలికలను పోలీస్ షాడో బృందం ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉన్నతాధికారులకు తెలియజేస్తుంది. ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఓడిన అభ్యర్థులు నిరసనలు తెలిపే, గెలిచిన వారు విజయోత్సవాలు నిర్వహించే, అల్లర్లు జరిగే అవకాశం ఉండడంతో ఎటువంటి ప్రదర్శనలకూ అనుమతి లేదని అధికారులు ముందే ప్రకటించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఏజెంట్లు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు, అభ్యర్థి తప్ప మిగతా నేతలు ఎవ్వరూ వెళ్లకూడదు. లెక్కింపు కేంద్రంలో సమస్యలు వస్తే ఆయా పార్టీల ద్వారా వచ్చిన సమాచారం మేరకు నేతలు వాటిలోకి వెళ్లేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని భావించి నాయకులందరినీ ఎక్కడికక్కడ నియంత్రించేందుకు పోలీస్ షాడో బృందాలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. ఆయా పార్టీల నాయకుల, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఇద్దరు నుంచి నలుగురు పోలీసులను నియమించారు. వీరంతా ఆయా నాయకుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తారు. నాయకులు బయటకు వెళితే వారిని అనుసరిస్తారు. కార్యకర్తలు, అనుచరులతో బయటకు వస్తే నియంత్రించి వెంటనే అధికారులకు సమాచారం ఇస్తారు. శాంతిభద్రతల సమస్య రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఎంతటి వారినైనా అనుమతి లేనిదే రోడ్డు మీదకు రాకుండా కట్టడి చేయాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సాధారణంగా ప్రభుత్వం నిర్ణయాలపై ప్రతిపక్షాలు నిరసన తెలపడం కోసం కార్యక్రమాలు ప్రకటిస్తే ముందుగానే పోలీసులు గృహ నిర్బంధం చేస్తుంటారు. కానీ, ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గృహనిర్బంధం చేయరు. కానీ, బయటకు వెళ్లకుండా నియంత్రించడానికి షాడో బృందాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులను లెక్కింపు కేంద్రాలకు వెళ్లడానికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. మంది, మార్బలంతో ఇతర ప్రదేశాలకు వెళితే వెంటనే నియంత్రిస్తారు.

మెక్సికో కొత్త అధ్యక్షురాలు షీన్ బామ్

- మితవాదులకు శృంగభంగం

మెక్సికో సిటీ: మెక్సికో తదుపరి అధ్యక్షురాలిగా ప్రగతిశీలవాది డా. క్లాడియా షీన్‌బామ్ తిరుగులేని మెజార్టీతో గెలుపొందారు. సైంటిస్టు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, హక్కుల కార్యకర్త అయిన ఆమె మెక్సికోను నయా ఉదారవాద విధానాలకు తావులేని ప్రత్యామ్నాయ ఆర్థికాభివృద్ధి నమూనాతో ముందుకు సాగుతానని ప్రకటించారు. తన సహచరుడు, ప్రస్తుత అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రడార్ (ఆమ్లో) అనుసరించిన ప్రజానుకూల విధానాలను కొనసాగిస్తానని చెప్పారు. అక్టోబర్ 1న నూతన అధ్యక్ష బాధ్యతలను ఆమె చేపడతారు. మొరెనా (మూవ్‌మెంట్ ఫర్ నేషనల్ రిజనరేషన్) పార్టీకి చెందిన 61 ఏళ్ల షీన్‌బామ్ లేబర్ పార్టీ (పిటి), గ్రీన్ ఎకాలజిస్ట్ పార్టీ ఆఫ్ మెక్సికో కలిసి 'లెట్స్ కంటిన్యూ మేకింగ్ హిస్టరీ' మిగతా 2లో

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- రాజ్యాంగాన్ని, చట్టాన్ని నిలబెట్టండి
- హంగ్ ఏర్పడితే ఎన్నికల ముందు ఏర్పడిన కూటమినే మొదట పిలవాలి
- రాష్ట్రపతికి, ఇసికి, సిజెఐకి ఏడుగురు రిటైర్డు జడ్జిల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ: భారత్‌లో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు రాజ్యాంగానికి గట్టిగా కట్టుబడి ఉండాలని, మరీ ముఖ్యంగా జూన్4న ఓట్లలెక్కింపు సందర్భంగా ఇది మరింత అవసరమంటూ వివిధ హైకోర్టులకు చెందిన ఏడుగురు రిటైర్డు న్యాయమూర్తులు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, సుప్రీం కోర్టులోని ఆయన సహచరుల కు, అలాగే కేంద్ర ఎన్నికల ప్రధానాధికారికి విజ్ఞప్తి చేశారు. వారు ఈ మేరకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సంఘం గత కొంత కాలంగా వ్యవహరిస్తున్న తీరు చూశాక ఈ ఆందోళన కలుగుతోందని అన్నారు.బూత్‌లవారీగా పోలైన ఓట్ల కచ్చితమైన సంఖ్యను వెల్లడించడానికి ఎన్నికల సంఘం తిరస్కరించడం ద్వారా ఎన్నికల నిబంధనావళిలోని 17(సి)ని అతిక్రమించింది. అలాగే ఎన్నికల్లో విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన వారిపై ఇసి కనీస చర్య కూడా తీసుకోలేదు. ఇసి అనుసరిస్తున్న ఈ అసమర్థ నిర్వాకమే తమను ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తోందన్నారు. బహిరంగ లేఖ రాసిన ఈ మాజీ న్యాయమూర్తులు ఏ రాజకీయ పార్టీతో అనుబంధం ఉన్నవారు కాదు. భారత రాజ్యాంగం పట్ల గట్టి నిబద్ధత కలిగినవారు. ఎన్నికల ప్రజాస్వామ్య విలువల్ని కాపాడాలన్న దాంతోనే ఈ లేఖ రాస్తున్నామని వారు పేర్కొన్నారు. 2024 పార్లమెంటరీ ఎన్నికల్లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల పట్ల తీవ్రమైన బాధతో ఈ విషయాన్ని మీ దృష్టికి తేవడం జరుగుతోందన్నారు. ఈ లేఖపై సంతకం చేసినవారిలో జిఎం అక్బర్ అలీ (మాజీ న్యాయమూర్తి, మద్రాసు హైకోర్టు), డి హరిపరంధామం (మాజీ న్యాయమూర్తి, మద్రాసు హైకోర్టు), అంజనా ప్రకాష్ (మాజీ న్యాయమూర్తి, పాట్నా హైకోర్టు), సిటి సెల్వన్ (మాజీ న్యాయమూర్తి, మద్రాస్ హైకోర్టు), పి.శివ కుమార్(మాజీ న్యాయమూర్తి, మద్రాసు హైకోర్టు) ఎస్ విమల (మాజీ న్యాయమూర్తి, మద్రాసు హైకోర్టు) ఉన్నారు.

భారత దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం తాలూకు భవిష్యత్తు ఎలక్టోరల్ డెమొక్రసీపైనే ఆధారపడి ఉన్నందున ఈ ఎన్నికలకు ఎనలేని ప్రాధాన్యత ఉందని వారు ఆ లేఖలో నొక్కి వక్కాణించారు. జనాభా పరంగా ప్రపంచంలోనే అతి పెద్ద దేశమైన భారత్‌లో మిగతా 2లో

ఎన్నికల్లో పోరాట స్ఫూర్తిని చాటారు

- సిఎం జగన్ ట్వీట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియలో వైసిపి కార్యకర్తలంతా గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు చాటిన స్ఫూర్తిని కౌంటింగ్ ప్రక్రియలోనూ కొనసాగించాలని సూచించారు. ప్రతి ఓటూ వైసిపి ఖాతాలోకి వచ్చేలా అప్రమత్తంగా వ్యవహరించి పార్టీకి అఖండ విజయాన్ని చేకూరుస్తారని ఆశిస్తున్నట్లు ట్వీట్ చేశారు.

'సుప్రీం'లో చెవిరెడ్డికి చుక్కెదురు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చంద్రగిరి నియోజకవర్గంలో ఫారం 17ఎ, ఇతర డాక్యుమెంట్ల విషయంలో మరోసారి స్క్రూటినీ చేయాలని, నాలుగు కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలని వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాము జోక్యం చేసుకునేందుకు కారణాలేవి కనిపించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో నాలుగు పోలింగ్ బూత్‌లలో అక్రమాలు జరిగాయని మోహిత్‌రెడ్డి చెబుతున్నారు. ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మోహిత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మోహిత్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టేసింది.

బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు : డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థులకు సవాలు విసురుతూ శాంతిభద్రతలకు పలువురు విఘాతం సృష్టిస్తున్నారని, అలాంటి పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కొంతమంది వ్యక్తిగత ధూషణలకు పాల్పడుతూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే పోస్టుల పట్ల గ్రూప్ అడ్మిన్‌లు కూడా అప్రమత్తంగా వుండాలని సూచించారు. అలాంటి పోస్టులను వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టుకోవడం, మరొకరికి షేర్ చేయడం నిషిద్ధమని తెలిపారు. రాష్ట్రంలో సోషల్ మీడియా పోస్టులపై పోలీస్‌శాఖ నిరంతర నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

(మొదటి పేజీ తరువాయి)

పద్దెనిమిదవ పార్లమెంటు ఎన్నికల్లో జూన్ 4 చివరి అంకమని అన్నారు. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఈ అతిపెద్ద కసరత్తులో మండుటెండలను సైతం ఖాతరు చేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు, కార్మికులు, రైతులు, యువత పెద్దయెత్తున బారులు తీరిన పరిస్థితిని చూశాం. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, సామాన్యునికి విశ్వాసం కలిగించేలా చూడాల్సిన బాధ్యత రాజ్యాంగబద్ధమైన సంస్థలు, అధికారులపై ఉందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా జరిగిన ఘటనలు, హింస వంటివాటి పట్ల మానవ హక్కుల సంఘాలు, హక్కుల కార్యకర్తల్లో అనేక భయాందోళనలు చోటు చేసుకున్నాయి. వీరి సహజమైన ఆందోళనల పట్ల ఎన్నికల సంఘం దృష్టిపెట్టాల్సిన అవసరముంది. ఇంతకుముందు అంటే మే25న మాజీ సివిల్ సర్వెంట్స్ ఇదే విషయమై చేసిన సంయుక్త ప్రకటన గురించి కూడా వారు ఈ లేఖలో ఉదహరించారు.

ఒక వేళ హంగ్ పార్లమెంటు ఏర్పడితే అధిక స్థానాలు కలిగి ఎన్నికల ముందు ఏర్పడిన కూటమినే రాష్ట్రపతి మొదట పిలవాలని, ఇది చిరకాలంగా అనుసరిస్తూ వస్తున్న ప్రజాస్వామ్య సంప్రదాయమని వారు చెప్పారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన రాష్ట్రపతిపై ఈ బాధ్యత ఉందని అన్నారు. అలాగే ఎంపీల బేరసారాలకు అవకాశం లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్లిష్ట సమయంలో సుప్రీం కోర్టు అంతిమ న్యాయనిర్ణేతగా వ్యవహరించాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని వారు కోరారు.

చెట్టు కొమ్మను తప్పించబోయి బస్సు బోల్తా

- మహిళ మృతి-21 మందికి గాయాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు కొమ్మను తప్పించే క్రమంలో ప్రయివేటు బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో మహిళ మృతి చెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలవ్వగా, 19 మంది స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఈదురు గాలులు, వర్షానికి గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చెట్టు విరిగిపడింది. కర్ణాటక రాష్ట్రం గంగావతి నుంచి యానం వైపు 39 మందితో బయలుదేరిన తులసి ప్రయివేటు ట్రావెల్ బస్సు పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పెట్లూరువారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై పడ్డ చెట్టును తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ప్రయాణికుల్లో విజయవాడకు చెందిన దివ్య (32) బస్సు కింద చిక్కుకుని మృతి చెందారు. డ్రైవర్, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

బస్సు కింద చిక్కుకుని మృతిచెందిన దివ్య

విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సు కింద చిక్కుకున్న దివ్య మృతదేహాన్ని జెసిబి సాయంతో బయటకు తీశారు. మృతురాలి బంధువులు, క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగిన మలేరియా కేసులు

- అల్లూరి జిల్లా మలేరియా అధికారి వివరణలో వెల్లడి
- జ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటన

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

మన్యంలో గత ఏడాది కంటే ఈ ఏడాది జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంది. గత ఏడాది జనవరి ఒకటి నుంచి జూన్ రెండు మధ్య 2,90,658 మంది జ్వరాల బారినపడగా, వారిలో 624 మందికి మలేరియా నిర్ధారణ అయింది. ఈ ఏడాది అదే సమయంలో జ్వరాల బారినపడ్డ 3,02,760 మందిలో 906 మందికి మలేరియా నిర్ధారణ అయింది. 'మన్యంలో ప్రమాద ఘంటికలు' శీర్షికన 'ప్రజాశక్తి' ప్రధాన సంచికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అల్లూరి జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ స్పందించి ఇచ్చిన ప్రకటనలో ఈ వివరాలు ఉన్నాయి. దీనినిబట్టి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మలేరియా పాజిటివ్ కేసులు 39.71 శాతం పెరిగినట్లు నిర్ధారణ అయింది. జ్వరాల అదుపునకు చేపట్టిన కార్యక్రమాల గురించి ఆయన వివరించారు.

ఈ ఏడాది జూన్ రెండు నాటికి నిర్ధారణ అయిన 906 మలేరియా కేసులకు చికిత్స అందించడంతోపాటు బాధితుల ఇంట్లోని, వారి ఇంటి చుట్టుపక్కల ఇళ్లల్లోని వారి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైరల్ జ్వరాలు వచ్చిన 2,040 మందికి ఎలిసా డెంగీ పరీక్షలు నిర్వహించగా 12 మందికి డెంగీ నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. వారికీ చికిత్స అందించినట్లు వివరించారు. ప్రతీ డెంగీ కేసు బాధితుల ఇంటి లోపల, చుట్టూ ఉన్న 50 ఇళ్లలో ఐఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జ్వరం వచ్చిన వారందరికీ పరీక్షలు చేసేందుకు గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంట్స్/హెల్త్ సెక్రటరీల దగ్గర మలేరియా ఆర్‌డిటి కిట్లను ఉంచామని తెలిపారు. వైరల్ జ్వరాలు వచ్చిన వారిలో అనుమానిత డెంగీ జ్వరాలకు తగిన పరీక్షలు చేసేందుకు విలేజీ హెల్త్ క్లినిక్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ రాపిడ్ కిట్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. మలేరియా నివారణకు 1,767 గ్రామాల్లో మొదటి విడత కార్యక్రమంలో భాగంగా గత నెల నుంచి ఎసిఎం అనే మందుతో ఇళ్లలో ఐఆర్ఎస్ పిచికారి చేసినట్లు తెలిపారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఏరియాలోగల ప్రయివేటు ఆస్పత్రులను సందర్శించి జ్వర పీడితుల వివరాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు పంపిస్తున్నామని తెలిపారు. యాంటిలార్వా ఆపరేషన్ నిర్వహిస్తున్నామని, అవసరమైన చోట దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నామని వివరించారు. ఐదు లక్షల దోమ తెరలను ఇంటింటికీ పంపిణీ చేసి వాటిని ఉపయోగించడంలో మన్యం వాసులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. డెంగీ, మలేరియా, ఇతర వైరల్ జ్వరాలు నివారణ విధానాలపై ఆడియో, వీడియో ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబుకు కొత్తకాదు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్‌పై దేశమంతా ఒక నిబంధన వుంటే, రాష్ట్రంలో మాత్రమే మరో నిబంధన వుందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చంద్రబాబు తాత్కాలిక ఆనందం పొందుతున్నారని, అంతిమంగా గెలిచేది వైసిపినేనని అన్నారు. వైసిపి శ్రేణులంతా మంగళవారం ఉదయం 10:30 గంటలకు విజయోత్సవాలకు సిద్ధంగా వుండాలని కోరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ అందరినీ భయపెడుతున్నారని అన్నారు. అధికార యంత్రాంగాలపై పట్టు సాధించే ప్రయత్నాలూ చేశారని విమర్శించారు. జాతీయ స్థాయిలో ఇచ్చిన ఎగ్జిట్ పోల్స్ అన్నీ తప్పేనని అన్నారు. చంద్రబాబుకు బిజెపితో పొత్తు లేకుంటే అలాంటి ఫలితాలు ఇచ్చుండేవారే కాదన్నారు. 21 సీట్లలో పోటీ చేసిన జనసేనకు 7 శాతం ఓటింగ్ ఎలా సాధ్యమో చెప్పాలన్నారు.

విజయోత్సవాలకు ఏర్పాట్లు

కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై 10:30 లోపు ఫలితాలకు సంబంధించి ట్రెండ్స్ వ్యక్తమయ్యే అవకాశం వున్నందున వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 10:30 గంటలకు వైసిపి విజయంపై సంబరాలు చేయాలని ఆ పార్టీ పేర్కొంది. ఈ మేరకు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం ఎదుట పెద్దయెత్తున విజయోత్సవాలకు ఆ పార్టీ కార్యకర్తలు సన్నాహాలు చేపట్టారు. కేక్ కటింగ్‌లు, సంగీత విభావరితో కేంద్ర కార్యాలయం వద్ద సంబరాలకు సోమవారం సాయంత్రం నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు సార్వత్రిక ఫలితాలు

- 19వ లోక్‌సభ... ఎపి, ఒడిశా అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలు ఏడు దశల్లో జరిగాయి. తొలిదశ పోలింగ్ ఏప్రిల్ 19న జరగ్గా, చివరి (ఏడో) దశ పోలింగ్ జూన్ ఒకటిన జరిగింది. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశాలోని అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటికి సంబంధించిన ఓట్ల లెక్కింపు చేసి, ఫలితాలు వెల్లడిస్తారు. అందుకనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఏర్పాట్లు పూర్తయినట్లు ఇసి తెలిపింది.

ఎగ్జిట్ పోల్స్ బిజెపికి అనుకూలంగా వచ్చినప్పటికీ, ఆ పార్టీ నేతలు అపనమ్మకంతోనే ఉన్నారు. ఎందుకంటే ఓటింగ్ తగ్గడం ఒక కారణంగా ఉంది. ఏడు దశల్లోనూ 2019 ఎన్నికల కంటే, తక్కువ పోలింగ్ జరిగింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశ 66.14 శాతం, రెండో దశ 66.71, మూడో దశ 66.68, నాలుగో దశ 69.16, ఐదో దశ 62.2, ఆరో దశ 63.36, ఏడో దశలో 61.63 శాతం ఓటింగ్ నమోదైంది.

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి ఒకరోజు ముందు (సోమవారం) జూన్ 3న నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఎన్‌డిఎ మిత్రపక్షం, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్.. ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాతో సమావేశమయ్యారు. జెపి నడ్డా నివాసంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. 'జెపి నడ్డా అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా వంటి సీనియర్ మంత్రులు, అలాగే ఇతర మంత్రులు, కొంతమంది పార్టీ ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఏడు దశల్లో ఓటింగ్ ఎలా జరిగిందనే దానిపై ప్రధానంగా సమీక్షించడంతోపాటు కౌంటింగ్ సన్నాహాలను కూడా సమీక్షించాల్సి ఉంది' అని నడ్డా ఇంట్లో జరిగిన సమావేశం గురించి బిజెపి సీనియర్ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే చెప్పారు. హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఎం.ఎల్. ఖట్టర్‌తో పాటు సీనియర్ మంత్రి పీయూష్ గోయల్ కూడా ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. అలాగే చివరి దశ పోలింగ్ జూన్ ఒకటిన ఇండియా ఫోరం సమావేశమైంది. సమావేశ అనంతరం ఇండియా ఫోరానికి 295కు పైగా స్థానాలు పెరుగుతాయని ప్రకటించారు.

ఎన్నికల బరిలో 744 పార్టీలు
అభ్యర్థుల్లో 47 శాతం మంది స్వతంత్రులే

ఏప్రిల్ 19-జూన్ 1 తేదీల మధ్య ఏడు విడతలుగా 543 నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 8,360 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. జాతీయ పార్టీల్లో బిఎస్‌పి అత్యధికంగా 488 మంది అభ్యర్థులను బరిలో దింపింది. ఆ తర్వాతి స్థానం బీజేపీదే. ఆ పార్టీ తరపున 441 మంది పోటీ చేశారు. కాంగ్రెస్ 328, సిపిఎం 52, ఆప్ 22, నేషనల్ పీపుల్స్ పార్టీ 2 స్థానాలకు పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 744 పార్టీలు తమ అభ్యర్థులను నిలిపాయి. వీటిలో ఆరు జాతీయ పార్టీలుగా గుర్తింపు పొందినవి. మొత్తం అభ్యర్థుల్లో 16 శాతం మంది జాతీయ పార్టీల తరపున పోటీ చేశారు. 6 శాతం మందిని రాష్ట్ర పార్టీలు పోటీకి దింపాయి. మొత్తం అభ్యర్థుల్లో 47 శాతం మంది స్వతంత్రులే. రాష్ట్ర పార్టీల్లో సమాజ్‌వాదీ పార్టీ 71 మందిని, తృణమూల్ కాంగ్రెస్ 48 మందిని రంగంలో నిలిపాయి. గుర్తింపు పొందని పార్టీల్లో సోషల్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) అత్యధికంగా 150, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమొక్రటిక్) 79 స్థానాలకు పోటీ చేస్తున్నాయి.

ప్రతి స్థానంలోనూ సగటున 15 మంది పోటీ

18వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలోనూ సగటున 15 మంది పోటీ చేశారు. తెలంగాణలో ఒక్కో నియోజకవర్గంలో సగటున 31 మంది పోటీ చేయగా, నాలుగు రాష్ట్రాల్లో పది మంది చొప్పున పోటీలో ఉన్నారు. లడక్, నాగాలాండ్‌లో ఒక్కో స్థానంలో ముగ్గురేసి అభ్యర్థులు పోటీ పడ్డారు. తమిళనాడులోని కరూర్‌లో అత్యధికంగా 54 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో 46 మంది స్వతంత్రులే. మొత్తం 9 స్థానాల్లో 40 లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేశారు.

10 శాతం మహిళా అభ్యర్థులు

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సగటు వయసు 48 సంవత్సరాలు. జాతీయ పార్టీల తరపున పోటీ చేసిన వారిలో 13 శాతం మంది వయసు 40 సంవత్సరాల లోపే. బిఎస్‌పి అభ్యర్థులుగా పోటీ చేసిన 98 మంది వయసు కూడా 40 సంవత్సరాల లోపే ఉంది. డిఎంకె అభ్యర్థులందరూ 40 సంవత్సరాల పైబడిన వారే. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో 10 శాతం మంది మహిళలు ఉన్నారు.

విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు

- పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయని, దీనివల్ల బంగాళాఖాతానికి ఆనుకుని దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో ఆవర్తనం కొనసాగుతోందని, మంగళవారం రాష్ట్రంలో అక్కడక్కడా ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు పడతాయని ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు ఎండి రోణంకి కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక, రాయలసీమ, కోస్తాంధ్ర మరికొన్ని ప్రాంతాలు, పశ్చిమ మధ్య, బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు విస్తరించాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాల్లో పనిచేసే రైతులు వ్యవసాయ కూలీలు, పశు, గొర్రెల కాపరులు, చెట్లు, పోల్స్, టవర్స్ కింద బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని తెలిపారు.

అన్నవరంలో విషాదం

- చేపల చెరువులో పడి అన్నాచెల్లెళ్లు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి (ఏలూరు జిల్లా)

ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చేపల చెరువులో జారిపడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లి పంచాయతీ శివారు అన్నవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నవరం గ్రామానికి చెందిన బట్టు సురేష్‌బాబు, రాణి దంపతులకు ఒక కుమారుడు కుమార్ (7), కుమార్తె వర్షిక(5) ఉన్నారు. సురేష్‌బాబు లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. సురేష్‌బాబు ఆదివారం డ్యూటీకి వెళ్లారు. సోమవారం మధ్యాహ్న సమయంలో అన్నాచెల్లెళ్లు ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న చేపల చెరువులో జారి పడ్డారు. పిల్లలు ఇంటి వద్ద కనిపించకపోవడంతో తల్లి రాణి చుట్టుపక్కల గాలించగా కుమార్తె చెరువులో నీటిపై తేలియాడుతూ కన్పించింది. వెంటనే బయటికి తీసి ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడి కోసం కుటుంబ సభ్యులు చెరువులో దిగి వెతకగా కుమార్ మృతదేహం లభ్యమైంది. గ్రామ విఆర్ఒ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారుల మృతికి గల కారణాలను సేకరించారు. గతేడాది చేపల చెరువును ఆక్వా రైతు మరమ్మతుల పేరుతో లోతుగా తవ్వినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

అధికార దుర్వినియోగం చేస్తున్న రాష్ట్రప్రభుత్వం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని కేంద్ర ఎన్నికల సంఘాని(సిఈసి)కి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. అస్మదీయ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు ఇష్టానుసారం ప్రభుత్వం అప్పులు చేస్తోందని తెలిపారు. ఈ మేరకు సిఇసికి సోమవారం లేఖ రాశారు. కేంద్రప్రభుత్వం విధించిన ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని రాష్ట్రప్రభుత్వం జూన్ 1వ తేదీకే దాటివేసిందని పేర్కొన్నారు. ఈ ఏడాది చేసిన అప్పుల్లో ఎక్కువ శాతం అప్పులు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత చేశారని తెలిపారు. ఆర్‌బిఐ ప్రకటన ఆధారంగా ప్రభుత్వం సోమవారం మరో రూ.4వేల కోట్ల అప్పులకు దరఖాస్తు చేసిందని తెలిపారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో అధికారం కోల్పోతున్న ప్రభుత్వం ఇంతపెద్ద మొత్తంలో అప్పులు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ అంశంపై జోక్యం చేసుకుని ఫలితాలు విడుదలయ్యే వరకు ప్రభుత్వ అధికారులు ఎటువంటి చెల్లింపులు చేయకుండా అడ్డుకోవాలని కోరారు.

సజ్జల, పేర్నిలను అదుపులోకి తీసుకోవాలి: రామ్‌భూపాల్ రెడ్డి

ప్రజలను, ఉద్యోగులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్న వైసిపి నేతలు పేర్ని నాని, సజ్జల రామకృష్ణారెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకొని కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలుగకుండా చూడాలని టిడిపి ఎమ్మెల్సీ రామ్‌భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల కౌంటింగ్‌లో గందరగోళాన్ని సృష్టించేందుకు వైసిపి నేతలు శతవిధాల ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పేర్ని పేట్రేగితే భయపడే ఉద్యోగులు, టిడిపి కార్యకర్తలు ఎవరూ లేరని అన్నారు సజ్జల, పేర్ని నానిలపై నమోదైన కేసులపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి వర్ల రామయ్య లేఖ రాశారు. రాష్ట్రాన్ని దోచిన వైసిపిని ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధమయ్యారని టిడిపి మాజీఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు.

ఎన్నికల ప్రక్రియ విచ్ఛిన్నంపై ఆధారాలుంటే ఇవ్వండి!

- మీడియా సమావేశంలో సిఇసి రాజీవ్‌కుమార్

న్యూఢిల్లీ : భారత ఎన్నికల ప్రక్రియపై ప్రతిపక్షాలు వ్యక్తం చేసిన ఆరోపణలకు ఆధారాలుంటే ఇవ్వాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కోరారు.. బృహత్తరంగా సాగిన ఈ ఎన్నికల ప్రక్రియను విచ్ఛిన్నం చేసేలా రిటర్నింగ్ అధికారులు, జిల్లా మేజిస్ట్రేట్‌లను ప్రభావితం చేసినట్లు కాంగ్రెస్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఆధారాలు చూపితే వాటిని పరిశీలించి కమిషన్ కచ్చితంగా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటుందని అన్నారు.

లోక్‌సభ ఎన్నికల క్రమం ముగిసిన వెంటనే ఎన్నికల కమిషన్ పత్రికా సమావేశం పెట్టడం ఇదే తొలిసారి. ఎన్నికల కమిషన్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనలను నిర్లక్ష్యం చేస్తోందని సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. తప్పుడు ఓటర్ల జాబితాలు, ఇవిఎంలపై ఆరోపణలు, ఓటర్ల టర్నవుట్ డేటాను అందజేయడంలో వైఫల్యం వంటి అంశాలపై తప్పుడు కథనాలు వచ్చాయని వాటిని అరికట్టలేకపోవడం ఈసారి ఎన్నికల నుండి తాము నేర్చుకున్న పెద్ద గుణపాఠమని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. 'గల్లంతైన పెద్ద మనుష్యులు' అంటూ సోషల్ మీడియాలో ఇసిపై వచ్చిన మీమ్‌లు, ట్రోల్స్‌పై ఆయన స్పందించారు. తామెక్కడికీ వెళ్లిపోలేదని, ఇక్కడే వున్నామని, పత్రికా ప్రకటనల ద్వారా మాట్లాడుతునే వున్నామని చెప్పారు. మతోన్మాద విషాన్ని వెళ్లగక్కుతున్న ప్రధాని మోడీ సహా బిజెపి నేతలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇసిపై ఈ విమర్శలు వచ్చాయి. గతంలో ఏ ఎన్నికల సమయంలో ఎవరూ చేయని రీతిలో ఈసారి వందకు పైగా ప్రెస్‌నోట్‌లు జారీ చేశామన్నారు. బిజెపి సాగించిన మతోన్మాద ప్రచారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించకపోయినా ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన వారిపై కమిషన్ సుమోటో నోటీసులు జారీ చేసిందన్నారు. 495 ప్రధాన ఫిర్యాదులు అందాయని, వాటిలో 90శాతానికి పైగా ఫిర్యాదులను పరిష్కారించామన్నారు. అనేకమంది ఉన్నత స్థాయి నేతలకు నోటీసులు ఇచ్చామని, చాలామందిపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశామని, ఉన్నతాధికారులను బదిలీలు చేశామని చెప్పారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుండి 150మంది జిల్లా కలెక్టర్లకు కాల్స్ వచ్చాయని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఆరోపణలు చేయడంపై స్పందించిన ఇసి సోమవారం సాయంత్రం 7గంటల్లోగా వివరాలు అందచేయాలని ఆదేశించింది. ఇటువంటి సమాచారం ఏది వున్నా కానీ ఓట్ల లెక్కింపునకు ముందుగానే ఇవ్వాలని ప్రతిపక్షాలను కూడా ఇసి కోరింది. "మీరు పుకార్లు వ్యాప్తి చేయలేరు, ప్రతి ఒక్కరినీ అనుమానాస్పద రీతిలో నిలబెట్టలేరు.' అని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల క్రమం కొనసాగుతున్న సమయంలో తప్పుడు కథనాలు వ్యాప్తి చెందకుండా ఆపడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందనడాన్ని ఆయన అంగీకరించారు. ఆదివారం ఇసిని కలిసిన బహుళ పార్టీ ప్రతినిధి బృందం చేసిన డిమాండ్లను రాజీవ్‌కుమార్ అమోదించారు. వారు లేవనెత్తిన అంశాలు గత ఏడు దశాబ్దాలుగా సాగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగమేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా 64.2కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. వీరిలో 31.2 కోట్ల మంది మహిళా ఓటర్లని చెప్పారు. ప్రపంచంలోనే ఇది అత్యధికమని చెప్పారు. 68వేలకు పైగా పర్యవేక్షక బృందాలు, కోటిన్నర పోలింగ్, సెక్యూరిటీ సిబ్బంది ఈ ఎన్నికలకు పనిచేశారన్నారు.

మెక్సికో కొత్త అధ్యక్షురాలు షీన్ బామ్

(మొదటి పేజీ తరువాయి)

అనే కూటమిని ఏర్పాటు చేసి ఆ కూటమి తరపున బరిలోకి దిగి 58 శాతం ఓట్లతో విజయపతాక ఎగురవేశారు. ఆమె ప్రధాన ప్రత్యర్థి, మితవాద కూటమి (పిఆర్ఐ, పిఎఎన్, పిఆర్‌డి) కి చెందిన సోచితిల్ గాల్వెజ్ 28 శాతం ఓట్లతో చాలా వెనుకబడిపోయారు. సిటిజెన్స్ మూవ్‌మెంట్ పార్టీ అభ్యర్థి జోర్గె అల్వారెజ్ 10శాతం ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. మెక్సికో జాతీయ ఎన్నికల సంఘం ఫలితాలను వెల్లడించిన వెంటనే షీన్ బామ్ వేలాది మంది మద్దతుదారుల సమక్షంలో విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు."ఈ విజయం నాకు చాలా ఆనందం కలిగించింది. ఒక మహిళ ఈ అత్యున్నత స్థానానికి చేరుకోవడం 200 ఏళ్ల దేశ చరిత్రలో ఇదే ప్రథమం. ఈ విజయం చేకూర్చిన మీకందరికీ కృతజ్ఞతలు. ఆమ్లో ప్రవేశపెట్టిన 'ఫోర్త్ ట్రాన్స్‌ఫర్మేషన్' (నాల్గవ పరివర్తన) పంథాలో ముందుకు సాగుదాం" అని ఆమె అన్నారు. మెక్సికో అధ్యక్షపదవితోబాటు, పార్లమెంటులో దిగువ సభ అయిన చాంబర్ ఆఫ్ డిప్యూటీస్ (ఎంపీలు), సెనేట్, తొమ్మిది రాష్ట్రాల గవర్నర్ల పదవులకు, వివిధ నగరాల మేయర్ స్థానాలకు, స్థానిక అసెంబ్లీలకు ఆదివారం ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ అన్ని స్థాయిల్లోను మొరేనా పార్టీ నేతృత్వంలోని కూటమి విజయ ఢంకా మోగించడం విశేషం.

మరికొన్ని గంటల్లో ... ఉత్కంఠకు తెర

(మొదటి పేజీ తరువాయి)

నియోజవకర్గాలకు 13 రౌండ్లు మాత్రమే లెక్కించనున్నారు. 111 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20 రౌండ్లు, 61 నియోజకవర్గాల్లో 21 నుండి 24 రౌండ్లు, మూడు నియోజకవర్గాల్లో 25 రౌండ్లు లెక్కించనున్నట్లు సిఇఓ తెలిపారు. దీంతోపాటు పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి 102 నియోజకవర్గాల్లో రెండు రౌండ్లలో ఫలితాలు వస్తాయి.

ఉదయం 11 గంటలకి ట్రెండ్

పార్లమెంటు నియోజకవర్గాల్లో 454 మంది, అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,387 మంది భవితవ్యం నేడు తేలనుంది.ఉదయం 11 గంటలకే ట్రెండ్ తెలిసిపోనుంది. సెల్‌ఫోన్లను కౌంటింగ్ సెంటర్లలోకి అనుమతించేది లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఏజెంట్ల రాకపోకలపైనా స్పష్టమైన విధివిధానాలు రూపొందించారు. ఎవరైనా ఘర్షణకు దిగితే వారిని కౌంటింగ్ సెంటర్ బయటకు పంపించడంతోపాటు అరెస్టు చేయాలన్న ఆదేశాలు జారీ అయ్యాయి. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లేవారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టు నిర్వహించనున్నారు. మద్యం సేవించి వచ్చేవారిని లోపలకు అనుమతించబోమని సిఇఓ ప్రకటించారు. ఈసారి అత్యధికంగా 4,88,666 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. ఉదయం 8.30 గంటల వరకూ పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.

అనంతరం ఇవిఎంలు ప్రారంభిస్తారు. ఒకవైపు పోస్టల్ బ్యాలెట్లు, మరోవైపు ఇవిఎంలు కౌంటింగ్ జరగనుంది. ఉదయం ఎనిమిది గంటల నుండి గంటగంటకూ ఫలితాలను సువిధ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. అనంతరమే ఫలితాలు ప్రకటిస్తారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద సాయుధ పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలు, రాష్ట్ర పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. కౌంటింగ్ సెంటర్లన్నిటినీ రెడ్‌జోన్లుగా ప్రకటించారు. ఇవిఎంల కౌంటింగ్ అనంతరం రెండు ఇవిఎంలలో పేపర్ స్లిప్పులను లెక్కించనున్నారు. దీనికోసం ఫలితాల వెల్లడి కనీసం నాలుగు నుండి ఐదుగంటలు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. పూర్తిగా ఫలితాలు తెలిసేందుకు రాత్రి 10 గంటల వరకూ పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కౌంటింగ్ సెంటర్లున్న రహదారులపై ఎటువంటి వాహనాలనూ అనుమతించడం లేదు. దీనికి సంబంధించి ఇప్పటికే పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు ప్రకటించారు. కౌంటింగ్ సందర్భంగా రాష్ట్రాల్లో హింసను ప్రేరేపించే విధంగా ప్రకటనలు చేసే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రహోంశాఖ ఇప్పటికే అన్ని రాష్ట్ర ప్రభుత్వాల సిఎస్‌లు, డిజిపిలకు ఆదేశాలు జారీచేసింది. కౌంటింగ్ కేంద్రాల్లోకి పెన్ను లేదా పెన్సిలు, ప్యాడ్, తెల్లపేపరు, ఫారం-17సిని మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా నేరుగా ఫలితాలు తెలుసుకోవచ్చు.

రఫాపై దాడులు నిలిపేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కల్పించేందుకు ముందుకు వస్తే 1967లో చాలా భూభాగాలను ఆక్రమించిన ఇజ్రాయిల్ ఆ తర్వాత కూడా ఆక్రమణలను కొనసాగించి చివరకు పాలస్తీనా ప్రజలకు దేశం లేకుండా చేసిందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం ఆర్థికంగా, రాజకీయంగా వున్న సమస్యల నుండి బయటపడేందుకు ప్రపంచంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టడంలో భాగంగానే గాజాపై దాడిని చేయిస్తోందని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనాకు సంఘీభావం, మద్దతు పెరుగుతోందన్నారు. యూరోప్, అమెరికాలోనే కాదు చాలా దేశాల్లో ప్రజలు పాలస్తీనాకు సంఘీభావంగా బయటకు వస్తున్నారని అన్నారు. ఒక జాతిని నిర్మూలించే ఈ ప్రక్రియను ప్రపంచమే వ్యతిరేకిస్తోందన్నారు. హమాస్ చర్యలను తీవ్రవాద చర్యలుగా ఆర్ఎస్ఎస్ చిత్రీకరించడం దారుణమన్నారు. పాలస్తీనా ప్రజల స్వాతంత్ర కాంక్షపై ఆర్ఎస్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మన ప్రభుత్వాలు పాలస్తీనాకు అండగా నిలిచాయన్నారు. ఇప్పుడు మతోన్మాద బిజెపి ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలిచిందని విమర్శించారు. ప్రపంచదేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నా ఐక్యరాజ్యసమితి గట్టి చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి ప్రసాద్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్ ఘాతుకాలకు అండగా వుంటోందని అన్నారు. శతాబ్దకాలంగా వున్న పాలస్తీనా సమస్య ఇప్పుడు గాజా, రఫా సమస్యగా మారిందన్నారు. పాలస్తీనాను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రలకు వ్యతిరేకంగా అమెరికాలో, యూరోప్‌లో పెద్దఎత్తున ఆందోళనలు సాగుతున్నాయని అన్నారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు మూర్తి మాట్లాడుతూ అక్టోబర్ 2023 నుండి గాజాపై సాగిస్తున్న అమానవీయదాడిలో 36 వేలమంది అమాయకులు మృతి చెందారని అన్నారు. దేశ సాంప్రదాయానికి భిన్నంగా మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో దౌత్యసంబంధాలు నెరపుతూ ఆయుధాలు, వలస కార్మికులను సరఫరా చేస్తోందన్నారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ కోసం 44 వేల మంది భారత కార్మికులను పంపడం సరైంది కాదన్నారు. ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం పాలస్తీనా నిర్మూలన కోసం అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న కుట్రలకు మద్దతు ఇస్తోందని విమర్శించారు. ప్రపంచంలో సొంత దేశంలోనే శరణార్థులుగా పాలస్తీనా ప్రజలు బతుకుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ పాలస్తీనాకు అండగా ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రముఖ రచయిత దివికుమార్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌కు ఇజ్రాయిల్‌కు మొదటి నుండి అవినాభావ సంబంధం వుందన్నారు. తాము రచయితలుగా గుజరాత్‌లో మైనార్టీలపై జరిగిన మారణహోమాన్ని అధ్యయనం చేసేందుకు వెళ్లినప్పుడు అక్కడి దాడుల్లో ఇజ్రాయిల్‌లో తయారు చేసిన బాంబులను వాడినట్లు ఆధారాలు లభించాయని తెలిపారు.

మృతి చెందిన జింకలను పరిశీలిస్తున్న పోలీసులు

రెండు జింకలు మృతి

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో రెండు చుక్కల జింకలు మృత్యువాతపడ్డాయి. బాపట్ల జిల్లా పంగులూరు మండలం భగవాన్ రాజుపాలెం సమీపం పెట్రోల్ బంకు ఎదుట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం గురించి హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఒంగోలు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వేటపాలెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై. జాన్సన్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జింకల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ముప్పవరం పశు వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్వరి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ..గుర్తు తెలియని వాహనం ఢీకొన్ని జింకలు మృతి చెందాయన్నారు. ఈ ప్రాంతంలో సుబాబుల్ తోటలు ఎక్కువగా ఉండటం వల్ల చుక్కల జింకలు, దుప్పులు తిరుగుతున్నట్లు తెలిపారు.

మేలో 125 శాతం పెరిగిన వేడిగాలి రోజులు

న్యూఢిల్లీ : భారత్‌లో మే నెలలో భానుడు తన ప్రతాపం చూపాడు. ఎండలు అధికంగా దంచి కొట్టాయి. మేలో దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ (వేడి గాలి) రోజులు 125 శాతం పెరిగాయి. సాధారణంతో పోలిస్తే ఇది రికార్డు స్థాయిలో పెరిగింది. ఇది వంద కోట్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. వేడిగాలులు ఎక్కువ కాలం ఉన్నకారణంగా అనేక ఉష్ణ సంబంధిత మరణాలు సంభవించాయని వివరించింది. దేశంలోని 36 సబ్ డివిజన్‌లలో సాధారణంగా 92 రోజుల వేడి గాలులు ఉంటాయి. కానీ, అది ఈ సారి 206 రోజులుగా ఉన్నదని ఐఎండి వెల్లడించింది.

అయితే, కేరళ, కర్నాటక తీరప్రాంతం, కొంకణ్, ఈశాన్య ప్రాంతంలో హీట్‌వేవ్ రోజులు లేవు. ఏప్రిల్‌లో సాధారణంగా 71 వేడిగాలి రోజులకు గానూ.. 66 శాతం పెరుగుదల నమోదు చేసి, 118 హీట్‌వేవ్ రోజులు రికార్డయ్యాయని ఐఎండి తెలిపింది. పశ్చిమ రాజస్థాన్‌లో మేలో అత్యధికంగా 16 హీట్‌వేవ్ రోజులు నమోదయ్యాయి. తూర్పు రాజస్థాన్ (14), హర్యానా, గుజరాత్ (12) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ, తూర్పు యూపీ, పశ్చిమ మధ్యప్రదేశ్ ఒక్కొక్కటి 10 రోజులు వేడిగాలిని చవిచూశాయి.

వేడిగాలుల కారణంగా రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, బీహార్, హర్యానా, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో మరణాల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. రాజస్థాన్‌లో 130, ఒడిశాలో 26, బీహార్‌లో 14, ఉత్తర ప్రదేశ్‌లో 13 అనుమానిత మరణాలు నమోదయ్యాయని నివేదికలు సూచిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న వేడిగాలులు ఆందోళనను కలిగిస్తున్నాయి. మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల కారణంగా భూమిపై సగటు వ్యక్తి గత సంవత్సరంలో సాధారణం కంటే 26 రోజులు అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలను అనుభవించినట్లు ఒక ఎన్‌జిఒ తన అధ్యయనంలో చెప్పింది. గత 12 నెలల్లో, 630 కోట్ల మంది ప్రజలు (ప్రపంచ జనాభాలో దాదాపు 80 శాతం మంది) కనీసం 31 రోజులపాటు తీవ్రమైన వేడిని అనుభవించారని ఆ ఎన్‌జిఒ నివేదిక పేర్కొనటం గమనార్హం.

కష్టజీవుల రాజ్య స్థాపనే 'పర్స' ఆశయం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

కష్టజీవుల రాజ్య స్థాపనే పర్స సత్యనారాయణ జీవిత ధ్యేయమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. అనకాపల్లిలోని సిఐటియు కార్యాలయంలో పర్సా సత్యనారాయణ శత జయంతి సభను యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య వక్తగా సిహెచ్.నర్సింగరావు హాజరై మాట్లాడారు. సత్యనారాయణ కార్మిక ఉద్యమ నేతగానూ, సిఐటియు ఆవిర్భావ వ్యవస్థాపకులుగానూ, తెలంగాణ సాయుధ పోరాట యోధులకు 10 లక్షల ఎకరాల భూమి పంపిణీలోనూ కీలక పాత్ర పోషించారని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత వరకు దేశంలో నిరుద్యోగ సమస్య ఉంటుందని భావించి దేశంలో సిఐటియును సమరశీల పోరాట సంఘంగా నండూరి ప్రసాదరావుతో కలిసి స్థాపించారని తెలిపారు. 32 సంవత్సరాలపాటు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగారన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఆయన తొమ్మిదేళ్ల జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. శాసనసభ సభ్యునిగా ఉన్న కాలంలో అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. నేడు మోడీ, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని, వీరి పాలనలో కార్మికులకు, కర్షకులకు రక్షణ పోయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సిఐటియు కార్మిక కర్షక మైత్రి ఉద్యమాలను చేపట్టిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ఎర్రజెండా ఉన్నంత వరకు పర్స సత్యనారాయణ బతికే ఉంటారన్నారు. కార్మిక సంక్షేమం కోసం అన్ని గ్రామాల్లో సిఐటియు జెండా ఎగరాలన్నదే ఆయన చిరకాల వాంఛ అని అన్నారు. సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా పర్స సత్యనారాయణ రాసిన 'నేను నా జీవితం' పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. ముందుగా సత్యనారాయణకు సభ ఘన నివాళులర్పించింది. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి, వెలుగు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపవతి తదితరులు పాల్గొన్నారు.

పర్స సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, చిత్రంలో కె.లోకనాథం, జి.వరలక్ష్మి, సిహెచ్.రూపవతి, కోటేశ్వరరావు

చంద్రగిరిలో మారణాయుధాలు స్వాధీనం

- మత్స్యకారుల ఆయుధాలుగా గుర్తింపు

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి)

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

కర్ణాటక నుంచి వస్తున్న ఓ వాహనంలోని ఆయుధాలు, మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా చంద్రగిరి జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. కర్ణాటక నుంచి వస్తున్న ఓ టెంపో ట్రావెలర్ వాహనాన్ని తనిఖీ చేశారు. రెండు కత్తులు, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాము మత్స్యకారులమని, మంగళూరులో చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తున్నామని బాధితులు పోలీసులకు తెలిపారు. వాహనంలోని 14 మంది నెల్లూరు జిల్లాకు చెందిన మత్స్యకారులుగా పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. తిరుపతి కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల భద్రత కొనసాగుతోందని తెలిపారు.

విత్తనాల సరఫరాకు చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు ఖరీఫ్ పంటకు సంబంధించి వివిధ రకాల విత్తనాల పంపిణీకి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ఖరీఫ్-2024 సబ్సిడీ, సబ్సిడీయేతర విత్తనాల సరఫరాపై వ్యవసాయశాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన వరి, వేరుశనగ, పత్తి తదితర రకాల విత్తనాలను సకాలంలో రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సిఎస్ ఆదేశించారు. మండలాల వారీ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నకిలీ విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి బాధ్యులైన సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది మొత్తం పూర్తి అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సబ్సిడీ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది వివరించారు. వరి విత్తనాలు 2.24 లక్షల క్వింటాళ్ల అవసరం కాగా, 2.35 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 67,617 క్వింటాళ్ల విత్తనాలను రైతు భరోసా కేంద్రాలు, తదితర చోట్ల సిద్ధం చేసి ఈ నెల ఒకటి నుంచి పంపిణీకి చర్యలు తీసుకున్నామని వివరించారు. 2.99 లక్షల వేరుశెనగ అవసరం ఉండగా, 3.5 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల క్వింటాళ్లను పంపిణీకి సిద్ధం చేశామని, వీటిల్లో 1.4 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు 40 శాతం సబ్సిడీపై అందించామని తెలిపారు. రాష్ట్రంలో 5.21 లక్షల హెక్టార్లలో పత్తిసాగు చేస్తారని అంచనా వేశామన్నారు.

వివిధ కంపెనీలకు చెందిన 26.6 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉందని చెప్పారు. 18.27 లక్షల ప్యాకెట్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని వివరించారు. సబ్సిడీయేతర విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు అందుబాటులో ఉంచామన్నారు. నూరుశాతం నాణ్యతతో కూడిన వివిధ రకాల విత్తనాలను అవసరమైన మేరకు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. 40 ప్రముఖ విత్తన కంపెనీలతో ఎంఒయు కుదుర్చుకుని సకాలంలో అందిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎమ్‌డి శివప్రసాద్, జెడి విడివి కృపాదాస్, మేనేజర్ జలందర్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తం

- టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల ఐదేళ్లపాటు పడ్డ కష్టాలకు మంగళవారంతో అడ్డుకట్ట పడబోతోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కూటమి కౌంటింగ్ ఏజెంట్లతో చంద్రబాబు సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాల లెక్కింపు నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ఐదేళ్ల పడ్డ కష్టాన్ని, శ్రమను కొన్ని గంటలపాటు కొనసాగించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై రాద్ధాంతం చేయాలనుకున్న వైసిపికి సుప్రీంకోర్టులోనూ మొట్టికాయలు తప్పలేదని విమర్శించారు. ఓటమిని జీర్ణించుకోలేని వైసిపి కౌంటింగ్‌లో హింసకు పాల్పడేందుకు సిద్ధంగా ఉందని, కూటమి ఏజెంట్లు సంయమనం కోల్పోవద్దని సూచించారు. కంట్రోల్ యూనిట్ నెంబర్ ప్రకారం సీల్‌ను ప్రతి ఏజెంట్ సరిచూసుకోవాలని చెప్పారు. డిక్లరేషన్ ఫామ్ తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. అనారోగ్య కారణాలతో ఏజెంటు ఎవరైనా రాలేకపోతే నిబంధనల ప్రకారం కౌంటింగ్‌కు ముందే మరొకరిని నియమించుకునే వెసులుబాటు ఉందన్నారు.

సందడి వాతావరణం

టిడిపి కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికలు జరిగిన తరువాత మొదటిసారి చంద్రబాబు టిడిపి కార్యాలయానికి సోమవారం చేరుకున్నారు. ఆయనకు ఆ పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం చెప్పడంతో పాటు 'సిఎం.. సిఎం' అంటూ నినాదాలు చేశారు.

టిడిపికి, ఎన్‌టిఆర్ ఫౌండేషన్‌కు విరాళాలు

టిడిపికి, ఎన్‌టిఆర్ ఫౌండేషన్‌కు పలువురు విరాళాలు అందించారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ అనుబంధ విభాగమైన ఎన్‌టిఆర్ ఫౌండేషన్‌కు టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్‌కృష్ణ రూ.2 కోట్లను విరాళంగా అందించారు. టిడిపి కార్యాలయంలో చంద్రబాబును కలిసి ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ టిడిపి అధ్యక్షులు వేమూరి రవి, ఎన్‌ఆర్‌ఐ గొట్టిపాటి శ్రీధర్ పాల్గొన్నారు. టిడిపికి రూ.25 లక్షల విరాళాన్ని ఎన్‌ఆర్‌ఐ, వ్యాపారవేత్త బొద్దులూరి కృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత ఎల్‌విఎస్‌ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

ఇడి సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌పై విచారణ వాయిదా

- సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ 7 వరకు పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మరో నలుగురిపై ఇడి దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు జులై 3కు వాయిదా వేసింది. కవితతోపాటు మరో నలుగురు నిందితుల పాత్రపై మే 10న ఇడి దాదాపు 8 వేల పేజీలతో 6వ సప్లిమెంటరీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు (అనుబంధ చార్జ్‌షీట్)ను ఇడి దాఖలు చేసింది. ఇందులో ఎమ్మెల్సీ కవిత, ఆప్ గోవా ప్రచారాన్ని నిర్వహించిన ముగ్గురు ఉద్యోగులు (చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చన్‌ప్రీత్ సింగ్, ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్‌లను ఛార్జ్‌షీట్‌లో నిందితులుగా పేర్కొంది. ఈ పిటిషన్‌ను గత నెల 29న ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు వెల్లడించింది. నిందితులను కోర్టులో హాజరుపర్చాలని ఆదేశించింది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం కవితను నేరుగా కోర్టులో హాజరుపర్చారు. అలాగే మరో నలుగురిని ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత, చన్‌ప్రీత్ సింగ్‌కు కస్టడీ పొడిగిస్తూ, అరెస్టు కాని ముగ్గురు నిందితులకు రూ.లక్ష పూచికత్తు విధించారు. పాస్‌పోర్ట్ జప్తు చేయాలని ఆదేశించారు. కేసు తదుపరి విచారణను జులై 3కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి కావేరి బవేజా వెల్లడించారు. అనంతరం కవితను కలిసేందుకు భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులకు అనుమతినిచ్చారు. వారితో మాట్లాడిన అనంతరం కవితను పోలీసులు తీహార్ జైలుకు తరలించారు.

సిబిఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో... సోమవారం మధ్యాహ్నం వర్చువల్ మోడ్ (విసి) ద్వారా ఆమెను కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా దర్యాప్తు సజావుగా సాగాలంటే కవిత కస్టడీని పొడిగించాలని సిబిఐ తరపున న్యాయవాది కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం, ఆమె జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 7 వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి

- ఎపి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గద్దె రవీంద్రరావు

ప్రజాశక్తి-రేపల్లె (బాపట్ల జిల్లా)

హయ్యర్ పెన్షన్‌పై పిఎఫ్ అధికారులు వెంటనే నిర్ణయం తీసుకొని కార్మికులకు మేలు చేయాలని ఎపి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గద్దె రవీంద్రరావు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా రేపల్లెలో హయ్యర్ పెన్షన్‌పై సోమవారం సిపిఎం కార్యాలయంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె రవీంద్రరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ఇపిఎఫ్ఓ-95 పెన్షనర్లకు శరాఘాతంగా మారిందన్నారు. ఈ తీర్పు ద్వారా హయ్యర్ పెన్షన్ అమలు చేయకుండా పిఎఫ్ అధికారులు అనేక సాకులు చూపుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల కాలంలో హైదరాబాద్ భర్కత్‌పురా ఇపిఎఫ్ఓ అధికారులు విడుదల చేసిన లేఖ రిటైర్డ్ ఉద్యోగులను మరింత ఆందోళనలోకి నెట్టిందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు 10డి ఫారంతో వేతన వివరాలు పంపాలని ఆర్‌టిసి పిఎఫ్ అధికారులను ఆదేశించిందని తెలిపారు. విజయవాడ పిఎఫ్ కార్యాలయం అధికారులు తమ బాధ్యత లేనట్లుగా వేతన వివరాలు డిపోలో రాయించుకుని రావాలంటూ గందరగోళానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. భర్కత్‌పురా ఇపిఎఫ్ఓ అధికారులు చిన్నచిన్న తప్పులను భూతద్దంతో చూస్తూ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్ రాకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరలోనే ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు కె.కోటేశ్వరరావు, కె.గంగాధర్‌రావు, కె.శివశంకర్‌రావు పాల్గొన్నారు.

'తెలంగాణ' కన్నా 'ఆంధ్రా'పై ఫోకస్

- ఎపి ఎన్నికల ఫలితాలపై ఖమ్మంలో ఉత్కంఠ
- జోరుగా సాగుతున్న బెట్టింగ్‌లు.. ఆస్తులు, ఇండ్ల తాకట్టు
- రూ.50వేల నుంచి రూ.కోట్ల వరకు సాగుతున్న పందేలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలు ఇలా ముగిశాయో లేదో ఎగ్జిట్‌పోల్స్ వెల్లువెలా వెలువడు తున్నాయి. తదనుగుణంగా బెట్టింగ్‌లు మరింత ఊపందు కున్నాయి. మరొక రోజులో (ఈనెల 4వ తేదీన) ఫలితాలు రానున్న నేపథ్యంలో వివిధ పార్టీల అభిమానులు బెట్టింగ్‌ను మరింత వేగవంతం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగో విడతలో మే 13వ తేదీన ఎన్నికలు పూర్తయ్యాయి. నాటి నుంచి ఎపి సరిహద్దు ప్రాంతాల్లో తెలంగాణ ఎన్నికల కంటే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలపై ఎక్కువగా బెట్టింగ్ సాగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత నుంచి ఎగ్జిట్‌పోల్స్ విడుదలవుతుండటంతో బెట్టింగ్ మరింతగా ఊపందుకుంది. ఆరా అనే ఓ సర్వే సంస్థ ఎగ్జిట్‌పోల్స్‌తో శనివారం కొద్ది గంటల్లోనే రూ.20 కోట్ల బెట్టింగ్ సాగినట్టు తెలుస్తోంది.

ఇండ్లు, ఆస్తులు తాకట్టు.. అమరావతిలో భూముల కొనుగోళ్లు

ఇప్పటికే ఇండ్లు, ఆస్తులు తాకట్టుపెట్టి పలువురు పందేలు కాస్తున్నారు. వైసిపికి 110కి పైగా స్థానాల్లో నెగ్గుతుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అభిమానులు రూ.లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నారు. దానికి దీటుగా ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తుందని మరికొందరు పందేలు కాస్తున్నారు. భద్రాచలంలో ఓ యువకుడు జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని రూ.33 లక్షలు పందెం కాశారు. అదే సమయంలో పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో ఓడిపోతారని మరో రూ.3 లక్షలు మొత్తంగా రూ.36 లక్షలు అతను బెట్ పెట్టడంతో పాటు వెంటనే మధ్యవర్తికి ఆ మొత్తం ఇచ్చేశాడు. ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెంకు చెందిన ఓ వ్యక్తి ఖమ్మంలో తనకున్న రూ.40 లక్షల విలువ చేసే ప్లాంట్‌ను తాకట్టుపెట్టి టిడిపికి అనుకూలంగా బెట్టింగ్ పెట్టారు. ఇదే మండలంలోని పెద్దతండాకు చెందిన ఓ వ్యక్తి జగన్ మళ్లీ సిఎం అవుతారని రూ.50 లక్షలకు పైగా విలువ చేసే ఇంటిని తాకట్టుపెట్టాడు. ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లో ఏపీ ఎన్నికల ఫలితాలపై ఎక్కువగా బెట్టింగ్ సాగుతోంది.

అమరావతిపై 'రియల్' చూపు..

ఎన్‌డిఎ కూటమి విజయంపై నమ్మకంతో ఓ సామాజిక తరగతికి చెందిన రియల్ వ్యాపారులు అమరావతిలో పెట్టుబడులు పెడుతున్నారు. భూములు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే 1/4 వంతు చెల్లించి ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. ఇలా పెట్టుబడులు పెట్టిన వారు వైసిపి వస్తే పరిస్థితి ఏంటని భయాందోళనతోనూ ఉన్నారు. కొద్దిరోజుల క్రితం వరకు ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో భూముల కొనుగోలు కోసం పరిశీలన చేసిన వీరంతా అనూహ్యంగా అమరావతిపై దృష్టి సారించటం ఆసక్తి గొలుపుతోంది.

మంత్రుల అనుచరులు విభిన్నంగా బెట్టింగ్

ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భట్టివిక్రమార్క అనుచరులు విభిన్నంగా బెట్టింగ్‌కు దిగుతున్నారు. కొందరు వైసిపికి, మరికొందరు ఎన్‌డిఎ కూటమికి అనుకూలంగా పందేలు కాస్తున్నారు. నలుగురైదుగురు అనుచరులు కలిసి ఓ గ్రూప్‌గా ఏర్పడుతున్నారు. దానిలోనే ఓ గ్రూపు వైసిపికి, మరో గ్రూపు టిడిపికి అనుకూలంగా బెట్టింగ్ పెడుతోంది. తలా రూ.50వేల చొప్పున నలుగురు కలిసి రూ.2 లక్షల వరకు ఈ బెట్టింగ్ పెడుతున్నారు. పవన్‌కల్యాణ్ గెలుపోటములపైనా పందేలు కాస్తున్నారు. కొందరు ఖమ్మం కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రఘురాంరెడ్డి విజయంపై బెట్టింగ్ పెట్టారు. ఆయన 2.05 లక్షల మెజార్టీతో గెలుస్తారని పందెం వేశారు. మరికొందరు లక్ష ఓట్లకు పైన మెజార్టీ సాధిస్తారని బెట్ పెట్టారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు లక్ష మంది వరకు ఐటీ ఉద్యోగులు ఉంటారు. వీరిలో ఎక్కువ మంది ఓ మూడు సామాజిక తరగతులకు చెందినవారే. వీరు అమెరికా మొదలు వివిధ దేశాల్లో ఉన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు వర్క్‌ఫ్రమ్ హోమ్ జాబ్స్ చేస్తున్నారు. వీరు కూడా ఎపి అసెంబ్లీ ఎన్నికలపై ఒక్కొక్కరు రూ.50వేల నుంచి రూ.లక్షకు పైగా బెట్టింగ్ పెట్టినట్టు తెలుస్తోంది. ఎపిలో ఉండే తమ ఫ్రెండ్స్, బంధువులతో మాట్లాడి బెట్టింగ్ చేశారు. శనివారం నుంచి ఎగ్జిట్‌పోల్స్ విడుదల అవుతుండటంతో తదనుగుణంగా పందేలు కాస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు.

ఎన్‌డిఎ అధికారంలోకి రావద్దని ప్రార్థనలు..

ఎన్‌డిఎ మూడోసారి అధికారంలోకి రావద్దని మైనార్టీలు ప్రార్థనలు చేస్తున్నారు. ఖమ్మంలోని పలు చర్చిలు, మసీదుల్లో గత రెండు, మూడు నెలలుగా ఈ ప్రార్థనలు కొనసాగుతున్నట్టు క్రిస్టియన్, ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు.

డివైఇఒ మెయిన్ పరీక్షకు 1:100కు ఎంపిక చేయాలి

- ఎపిపిఎస్‌సి కార్యదర్శికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డివైఇఒ) మెయిన్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులకు అవకాశం కల్పించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. ఈ మేరకు ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్‌కుమార్‌కు ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. ఎపిపిఎస్‌సి దాదాపు 15 ఏళ్ల తరువాత విడుదల చేసిన పోస్టులకు వేలాది మంది అభ్యర్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా పరీక్ష రాశారని తెలిపారు. ఎన్నికల తరగతులు, ఎన్నికల విధులు తదితర అంశాలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. దీంతోపాటు ప్రశ్నాపత్రం కొంత క్లిష్టతరంగా ఉందని అన్నారు. గతంలో గ్రూప్-2 ప్రశ్నాపత్రం క్లిష్టంగా ఉన్నప్పుడు ప్రిలిమినరీ పరీక్ష నుంచి మెయిన్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అదే పద్ధతిలో డివైఇఒ పరీక్షకు కూడా ప్రిలిమినరీ పరీక్ష నుంచి మెయిన్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అవకాశం కల్పించాలని అభ్యర్థుల తరపున కోరారు.

జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్
JM FINANCIAL Home Loans
కార్పొరేట్ గుర్తింపు నంబరు: U65999MH2016PLC288534
రిజిస్టర్డు ఆఫీసు: 7వ అంతస్తు, 7బి సినెర్జీ బిల్డింగ్, అప్పాసాహెబ్ మరాఠె మార్గ్, ప్రభాదేవి, ముంబయి-400025.

విజయవాడ లో బ్రాంచి చిరునామా మార్పు

కస్టమర్లను, సరఫరాదారులను మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరినీ కోరబడుచున్నది ఏమనగా, మా దిగువ బ్రాంచి ఆఫీసు 04 సెప్టెంబర్ 2024 నుండి కొత్త చిరునామాలోకి మార్చబడుచున్నదని దయచేసి గమనించగలరు.

పాత చిరునామా	కొత్త చిరునామా
జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్, 2వ అంతస్తు, 52-1, 1-5, 3ఎ, ఆర్‌జి టవర్స్, గునదాలా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520 008.	జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, 27-23-252, భాస్కర్ ప్లాజా, ఫ్లాట్ నం.301, గవర్నర్‌పేట్, రెవెన్యూ వార్డు 21ఎ, విజయవాడ, ఆం.ప్ర.-520002.

ప్రదేశం: విజయవాడ, తేది: 04.06.2024
సం/- అధీకృత అధికారి,
జెఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ తరపున.

यूनियन बैंक ऑफ इंडिया
भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
రామలింగేశ్వరపేట బ్రాంచి-09341
దేవిచౌక్, రామలింగేశ్వరపేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201. ఫోన్: 9326509341

లాకర్స్ ప్రకటన

వ.నెం.	లాకర్ నెంబర్	లాకరుదారుని పేరు
1	104	యమ్‌డి.హుమాయూన్
2	181	జె.వి.రంగారావు
3	138	కె.వరప్రసాద్ & కె.మల్లికాంబ

పైన పేర్కొన్న ఖాతాదారులు మా బ్రాంచ్ నందు లాకర్ సౌకర్యం పొందియున్నారు. వారు గత కొద్ది సంవత్సరాలుగా అద్దె బకాయి పడ్డారు మరియు పై అడ్రస్‌కు పంపిన నోటీసులు తిరిగి వచ్చిన కారణంగా బ్యాంక్ నిబంధనల అనుసారం లాకర్స్ పగులగొట్టి అందులోని వస్తువులను స్వాధీనత తీసుకొనబడును. పై ఖాతాదారులు లేక వారికి సంబంధించిన వారెవరైనా ఈ ప్రకటనను నోటీసుగా భావించి సరైన ధృవపత్రాలతో ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి **3 నెలలు (05.09.2024)**లోగా బ్రాంచి మేనేజర్ వారిని సంప్రదించగలరు.

తేది.03.06.2024
బ్రాంచి మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ADITYA BIRLA CAPITAL
రక్షిత పెట్టుబడి ఆర్థిక సలహా
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండ్, వేరవల్, గుజరాత్-362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్, 39-10-10, 1వ అంతస్తు, దత్తాసాయి వేమూరి టవర్స్, ఎం.జి.రోడ్, లబ్బీపేట్, విజయవాడ-520010.

అనుబంధం-4 స్వాధీనతా ప్రకటన
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))

ఏదైతే, క్రింది సంతకందారు ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేదీ: 08.03.2024** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, **రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ తాకట్టుదారులు శ్రీ శ్రీమన్నారాయణన్, తిరుక్కొవల్లూరి, శ్రీమతి టి. శిరీషా & మెసర్స్ శ్రీరికాన్ ఇంజినీర్స్** అనువారిని డిమాండ్ నోటీసు తేది నుండి చెల్లించు/ రియలైజేషన్ తేదీ వరకు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలుతోపాటు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా, నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **08.03.2024 నాటికి గలవి రూ.97,30,437.66 పై. (రూపాయలు తొంబై ఏడు లక్షల ముప్పై వేల నాలుగు వందల ముప్పై ఏడు మరియు అరవై ఆరు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు సదరు నోటీసుతో బట్వాడాలో వివాదాలు కలిగి మరియు తదపరి వడ్డీ& ఇతర చార్జీలతోపాటు నోటీసులోని పూర్తి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫల చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **31 మే, 2024న లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకొన్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, డిమాండ్ నోటీసు తేది నుండి చెల్లించు/ రియలైజేషన్ తేదీ వరకు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలతోపాటు **08.03.2024 నాటికి గలవి రూ.97,30,437.66 పై. (రూపాయలు తొంబై ఏడు లక్షల ముప్పై వేల నాలుగు వందల ముప్పై ఏడు మరియు అరవై ఆరు పైసలు మాత్రమే)**లను చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)పై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తి వివరణ

"ది షెడ్యూలు": ఆజంపుర, సబ్-రిజిస్ట్రీ, హైదరాబాద్, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మలక్‌పేట్, ఆస్మాన్‌గడ్, స్టేట్ బ్యాంక్ కాలనీ, పిటిన్ నం.1041619787 గల డోర్ నం. 16-2-751/సి/5/1 మరియు 16-2-751/సి/5/2 లో ఉమ్మడి ఏరియా, 200చ.అ.ల పార్కింగ్ ఏరియాతోసహా 831చ.అ.ల ఫ్లింత్ ఏరియాతో శ్రీనివాస్ అపార్టుమెంట్ యొక్క మూడవ అంతస్తులో ఫ్లాట్ నం.304 గల దానిలో ఫ్లాట్‌తోపాటు 625-49చ.గ.లు (522-9చ.మీ.)ల సైటు యొక్క పూర్తి విస్తీర్ణంలో 44-67చ.గ.లు (37-34చ.మీ.లు) విస్తీర్ణంతో ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **సైటు సరిహద్దులు:** తూర్పు: ఇ.నం.16-2-751/సి/5, దక్షిణం: 15అ.ల వెడల్పు రోడ్డు, పడమర: వాటర్ రిజర్వాయర్, ఉత్తరం: ఫ్లాట్ నం.13/సి లో ఇల్లు & యూసుఫ్ రహమాన్ ఖాన్ ఇల్లు. **ఫ్లాట్‌కు సరిహద్దులు:** తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై మరియు కారిడార్, ఉత్తరం: ఫ్లాట్ నం.303.

తేది: 04.06.2024,
ప్రదేశం: హైదరాబాద్.
ఎల్ఎఎన్: ఎబిఎఫ్ఎల్‌విజెడబ్ల్యుఎల్‌ఎపి0000136621.
అధీకృత అధికారి,
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్.

SWARNA SECURITIES LIMITED
CIN:L52520AP1990PLC011031
Regd. Off:27-1-102, II Floor, Swarnalok Complex, Governorpet, Eluru Road, Vijayawada – 520 002, AP.Phone:+91-0866-2575928
E-Mail:swarnasecurities@rediffmail.com | Website: www.swarnasecurities.com

34వ వార్షిక సర్వసభ్య సమావేశం ("ఎజిఎం"), ఇ-ఓటింగ్ వసతి మరియు పుస్తక ముగింపు సమాచార ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా కంపెనీ యొక్క సభ్యుల **34వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం)** శుక్రవారం, 28 జూన్, 2024న ఉ.10.00గం.లకు ఎం హోటల్, డోర్ నెం.54-15-3, శ్రీనగర్ కాలనీ, రింగ్ రోడ్, విజయవాడ-520008, ఆంధ్రప్రదేశ్, ఇండియాలో నిర్వహించబడును.

ఏజిఎం నోటీసు మరియు ఆ.సం.2023-24 కొరకు వార్షిక రిపోర్టుతోపాటుగా ఎక్స్‌ప్లెనెటరీ స్టేట్‌మెంట్‌ను సభ్యులకు ఇమెయిల్ చేయబడినది మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: https://www.swarnasecurities.comలో, సిడిఎస్ఎల్ ఇ-ఓటింగ్ వెబ్‌సైట్: https://www.evotingindia.com/noticeResults.jsp మరియు స్టాక్ ఎక్ఛేంజీ వెబ్‌సైట్: https://www.bseindia.com లో కూడా లభించును.

సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్)రెగ్యులేషన్స్, 2015 మరియు దానిలో పేర్కొన్న రూల్స్‌తో చదువగల కంపెనీల చట్టం, 2013లోని వర్తించు నియమాలను అనుసరించి, ఎజిఎంకి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ సదుపాయాన్ని అలాగే ఎజిఎం సమయంలో ఇ-ఓటింగ్ సదుపాయాన్ని కంపెనీ అందిస్తోంది. క్రింద ఇవ్వబడిన క్యాలెండర్ ప్రకారం **సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ ("సిడిఎస్ఎల్")** అందించిన రిమోట్ ఇ-ఓటింగ్ ప్లాట్‌ఫారమ్‌ని ఉపయోగించి సభ్యులు తమ ఓట్లను వేయవచ్చు:

1	సభ్యులు ఓటు వేయడానికి కటాఫ్ తేదీ (కటాఫ్ తేదీగా నమోదు చేయబడిన సభ్యులు ఎజిఎం సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ ద్వారా తమ ఓటు వేయడానికి అర్హులు)	శుక్రవారం, 21 జూన్, 2024
2	రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభం	25 జూన్, 2024 ఉ.9.00 గంటలకు (ఐఎస్టీకి)
3	రిమోట్ ఇ-ఓటింగ్ ముగింపు	27 జూన్, 2024 సా.5.00 గంటలకు (ఐఎస్టీకి)
4	ఎజిఎం తేదీ మరియు ఆ సమయంలో ఇ-ఓటింగ్ కోసం ప్రారంభ సమయం	28 జూన్, 2024, ఉ.11.00 గంటలకు (ఐఎస్టీకి)
5	ఎజిఎం రోజు, తేదీ & సమయం	శుక్రవారం, 21 జూన్, 2024. ఉ.11.00 గంటలకు (ఐఎస్టీకి)
6	ఇ-ఓటింగ్ ప్లాట్‌ఫారమ్ & ఇ-ఎజిఎం కోసం సర్వీస్ ప్రొవైడర్	సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ (సిడిఎస్ఎల్) మరియు ఇ-ఏజిఎం లేదు, ఫిజికల్ మోడ్ మాత్రమే
7	ఇ-ఓటింగ్ కోసం సర్వీస్ ప్రొవైడర్ (సిడిఎస్ఎల్) వెబ్‌సైట్	www.evotingindia.com
8	పుస్తక ముగింపు తేదీలు	బుధవారం 22-06-2024 నుండి 28-06-2024 వరకు (రెండు రోజులు కలుపుకొని)
9	ఇ-ఓటింగ్ సదుపాయానికి సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించడానికి బాధ్యత వహించే వ్యక్తి పేరు, హోదా, ఇ-మెయిల్ ఐడి మరియు ఫోన్ నంబర్	శ్రీ ఎం.అనిల్ కుమార్ కంపెనీ సెక్రటరీ & కాంప్లియన్స్ ఆఫీసర్, స్వర్ణ సెక్యూరిటీస్ లిమిటెడ్, ఫోన్: +910866-2575928 ఇమెయిల్: swarnasecurities@rediffmail.com సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్. టెలి: 1800225533; ఇమెయిల్: helpdesk.evoting@cdslindia.com

సభ్యులు తమ ఇమెయిల్ అడ్రస్‌లు, బ్యాంక్ వివరాలు మరియు మొబైల్ నెంబర్ మొదలైనవాటిని కంపెనీ/ఆర్‌టిఎ లేదా డిపాజిటరీ పార్టిసిపెంట్‌లతో రిజిస్టర్ చేసుకోని/ నవీకరించని సభ్యులు సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్‌లతో లేదా ఫిజికల్ విషయంలో "ఆర్తి కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ("కంపెనీ యొక్కఆర్‌టిఏ')లో http://www.aarthiconsultants.com/investors/register.php లింక్‌ని ఉపయోగించి రిజిస్టర్ చేయమని ఇందుమూలంగా అభ్యర్థించబడ్డారు. ఎజిఎంకి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ సిస్టమ్ ద్వారా లేదా ఎజిఎం సమయంలో ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓట్ల(ల) వేయవచ్చును. సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్, పోలింగ్ పేపర్ ద్వారా ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్‌పై వివరణాత్మక ప్రక్రియ కోసం ఏజిఎం నోటీసును రిఫర్ చేసుకోవచ్చును.

గమనికలు:

1) ఎజిఎం వద్ద రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ ద్వారా రెండింటిని ఎలక్ట్రానిక్ పద్ధతిలో తమ ఓటును వినియోగించుకునే సౌకర్యాన్ని కంపెనీ తన సభ్యులకు అందిస్తుంది. అన్ని వ్యాపారాలు ఎజిఎంకి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఎజిఎం సమయంలో ఇ-ఓటింగ్ మరియు పోలింగ్ పేపర్ ద్వారా మాత్రమేలావాదేవీలు నిర్వహించబడతాయి.
2) కటాఫ్ తేది నాటికి సభ్యుల రిజిస్టర్‌లో లేదా డిపాజిటరీల ద్వారా నిర్వహించబడే లబ్ధిదారుల యజమానుల రిజిస్టర్‌లో పేరు నమోదు చేయబడిన సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ లేదా ఇ-ఓటింగ్ ద్వారా మాత్రమే ఓటు వేయడానికి అర్హులు.
3) సభ్యుడు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా అతని/ఆమె/వారి ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత కూడా ఎజిఎంలో పాల్గొనవచ్చు కానీ ఏజిఎంలో మళ్లీ ఓటు వేయడానికి అనుమతించబడరు.

PLACE : Vijayawada
DATE : 03-06-2024

by order of the Board of Directors
For Swarna Securities Limited
Sd/-
M. Murali Krishna
Chairman &Managing Director
DIN: 01889812

సంపాదకీయం

సమగ్ర దర్యాప్తు అవసరం

మునుపు ఉమ్మడి రాష్ట్రంలోకానీ నేటి విభజిత ఆంధ్రప్రదేశ్‌లోకానీ గడచిన దశాబ్దన్నర కాలంలో ఎవరు అధికారంలో ఉన్నా ప్రభుత్వ, పేదల, అసైన్డ్ భూములపై కన్నేసి కాజేయడం ప్రజలకు బాగా అనుభవపూర్వకం. అందుకు విశాఖపట్నం కీలకం కావడం ఆలోచించాల్సిన సందర్భం. వైజాగ్, భోగాపురం చుట్టుపక్కల 800 ఎకరాల అసైన్డ్ భూములను, గతేడాది ప్రభుత్వం తెచ్చిన అసైన్‌మెంట్ భూముల బదిలీల నిషేధం (1977) సవరణ చట్టాన్ని అడ్డం పెట్టుకొని, అసైనీలను బలవంతపెట్టి, బెదిరింపులకు పాల్పడి హడావిడిగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని పత్రికల్లో వార్తలొచ్చాయి. సిఎస్ అంటే యావత్ ప్రభుత్వ పాలనకు బాస్ అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)పైనే ఆరోపణలొచ్చాయి. ఎన్నికల సమయంలో సర్వపాలనాధిపతి. ప్రభుత్వ, పేదల భూములను కాపాడాల్సిన బాధ్యత సిఎస్ సారథ్యంలోని యంత్రాంగానిది. కాగా తనపైనే ఆరోపణలొచ్చాయి కాబట్టి వెంటనే సమగ్ర విచారణకు ఆదేశించాల్సి ఉండింది. సిఎస్ ఆ పని చేయకుండా ఖండనలతో సరిపెట్టడం సరి కాదు. ఒక వేళ తనతో ప్రభుత్వంలోని పెద్దలు ఆ పని చేయించారనుకున్నా, బినామీ వ్యవహారాలైనా, సమగ్ర దర్యాప్తులోనే తేలుతాయి.

ప్రభుత్వం తెచ్చిన 35/2023 అసైన్‌మెంట్ చట్టాన్ని, దాని అమలుకు రూల్స్ నిర్ణయిస్తూ జారీ చేసిన జి.ఒ. 596ను అసాంతం పరిశీలిస్తే, పేదలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను పెద్దలు, కార్పొరేట్లు అప్పనంగా కొట్టేసే పథకం కనిపిస్తుంది. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో సాగుతున్న భూబాగోతం అందులో భాగమే. ఎస్‌సి, ఎస్‌టి, ఇతర పేదలకు సర్కారు కేటాయించిన వ్యవసాయ భూములపై సర్వహక్కులూ కల్పించేందుకు ఉద్దేశించింది సవరణ చట్టం. భూమిని అసైన్ చేసి 20 సంవత్సరాలైతే అమ్ముకోవచ్చు. వాస్తవానికి ఈ నిబంధన వాస్తవ అసైనీలకు కొంత వరకే మేలు చేస్తుంది. అసైనీల నుంచి ఇప్పటికే భూములను వశ పరుచుకున్న వారికి కూడా సర్వ హక్కులూ కల్పించడంలోనే అసలు కుట్ర దాగుంది. ఎవరు పొసెషన్‌లో ఉంటే వారిదే భూమి. ఈ లొసుగుతోనే పెద్దలు, బలవంతులు అసైన్డ్ భూముల కబ్జాలకు పాల్పడున్నారు. 1977 అసైన్డ్ చట్టానికి ఇటువంటి సవరణ చేయాలన్న ఆలోచన టిడిపి హయాంలోనే పురుడు పోసుకుంది. అయితే ఇళ్ల స్థలాల వరకే పరిమితమై, 2019లో ప్రభుత్వం దిగిపోయే చివరన చట్టం చేసింది. వైసిపి వచ్చాక రూల్స్ చేసింది. ఇళ్ల స్థలాల మట్టుకు 20 ఏళ్ల కాలపరిమితిని కాస్తా పదేళ్లకు కుదించింది. అసైన్డ్ భూములను కొట్టేసే విషయంలో వైసిపి, టిడిపి ఒకతానులో ముక్కలేనని అర్థమవుతుంది.

విశాఖ భూముల కుంభకోణం ఇప్పటిది కాదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే యారాడ కొండలను మింగేశారని ధర్మాన ప్రసాదరావుపైనా, అప్పట్లోనే బొత్స సత్యనారాయణపైనా ఆరోపణలొచ్చాయి. నవ్యాంధ్ర ఉనికిలోచ్చాక విశాఖలో భూదందాలపై దర్యాప్తునకు 2017-18 ప్రాంతంలో అప్పటి టిడిపి ప్రభుత్వం సిట్ వేసింది. భూకబ్జాలపై ఆ సమయంలో మంత్రులుగా ఉన్న టిడిపి నేతలు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు తదితరులపై విమర్శలొచ్చాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక మరొక సిట్ వేశారు. ఈ ప్రభుత్వంలో కూడా భూఅక్రమాలు యధేచ్ఛగా సాగాయని ప్రజలే చెబుతారు. ఎక్కడో కడప నుంచి శ్రీకాకుళం వచ్చి భూదందా చేస్తున్నారని గతంలో ధర్మాన ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే తమ అనుయాయూలను కాపాడుకునేందుకు టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వేసిన సిట్ నివేదికలు బహిర్గతం కాకుండా తొక్కిపెట్టారనే భావన ప్రజల్లో బలంగా ఉంది. పేదలు కొన్ని దశాబ్దాలుగా తమ అనుభవంలో ఉన్న భూములకు పట్టాలిమ్మంటే సవాలక్ష అభ్యంతరాలు చెప్పే ప్రభుత్వాలు, మాఫియాలపై మాత్రం ఉదాసీనత కనబరచడం దుర్మార్గం. ప్రభుత్వ, పేదల భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వాధీశులే దురాక్రమణలకు పాల్పడటం, కబ్జాకోరులకు అండగా నిలవడం దారుణం. పార్టీలతో సంబంధం లేకుండా ఎవరు అధికారంలోకొచ్చినా విశాఖ భూముల కుంభకోణంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. అప్పుడే పేదలకు న్యాయం జరుగుతుంది.

మహనీయుల మాట

కసిని పెంచే మతము
కనులు కప్పే గతము
కాదు మన అభిమతము
ఓ కూనలమ్మ!

\- ఆరుద్ర

ప్రముఖ కవి, కథకుడు,
సాహితీవేత్త, పరిశోధకుడు.
జననం : 31.8.1925
మరణం : 4.6.1998

వర్గ స్వభావాన్ని మరుగుపరిచే లక్షణం



వారసత్వ పన్ను విషయంలో బిజెపి అనుసరిస్తున్న వైఖరిని బట్టి ఫాసిస్టు స్వభావం గల ప్రభుత్వాలు ఏ విధంగా వ్యవహరిస్తాయో తెలుసుకోవచ్చు. నయా ఉదారవాద శకంలో ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంత విపరీతంగా పెరిగాయో అందరికీ తెలిసిన విషయమే. ఇదేదో కేవలం మన దేశానికే పరిమితమైన ధోరణి కాదు. ఇది అంతర్జాతీయంగా జరుగుతున్న సంగతి. బూర్జువా వర్గ వేదికలలో సైతం దీని మీద చర్చ జరుగుతోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో కూడా ఈ అసమానతల పెరుగుదలను అరికట్టే చర్యల ఆవశ్యకత గురించి పదే పదే చర్చ జరుగుతోంది.

అవధులు లేని విధంగా ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఈ విధంగా పెరిగిపోవడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకు ముప్పు కాగలదని ప్రపంచంలోని అత్యంత సంపన్నులు సైతం గుర్తించారు. ఇలా గుర్తించినందువల్లనే పలువురు అమెరికన్ శతకోటీశ్వరులు కొంత కాలం క్రితం తమ మీద, తక్కిన సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలని సూచిస్తూ ప్రకటించారు.

ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం మన దేశంలోని సంపన్న వర్గాలు మాత్రం అటువంటి దూరదృష్టిని ఏ మాత్రమూ ప్రదర్శించడంలేదు. ఫాసిస్టు శక్తులను బలపరిస్తే చాలునని, ఆ శక్తులు మత, కుల విద్వేష రాజకీయాలను ప్రయోగించి ఎన్నికల్లో ఏదోవిధంగా గెలుస్తాయని, ఆ తర్వాత తమ ఆధిపత్యానికి ఎదురయ్యే ఎటువంటి సవాలునైనా అత్యంత నిరంకుశ చర్యల ద్వారా అణచివేస్తాయని, అటువంటి ఫాసిస్టు శక్తుల తోడును ఉపయోగించుకుని తమ ఆదాయాలను, సంపదను అనంతకాలం పెంచుకుంటూ పోవచ్చునని ఆ సంపన్న వర్గాలు భావిస్తున్నాయి. ఒకానొక సమయంలో జి.డి.బిర్లా వంటి భారతీయ బూర్జువాలు తమ తమ సంపదలను విచ్చలవిడిగా ప్రదర్శిస్తూ పోవద్దని తక్కిన పెట్టుబడిదారులకు సలహా ఇస్తూండేవారు. ఆ కాలంలో ప్రజానీకంలో వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందన్న భయం వారిని వెన్నాడుతూ వుండేది. ఇప్పుడటువంటి భయాలు ఏమీ లేవు. ఇప్పటి బూర్జువా వర్గం హిందూత్వ శక్తులతో తమ చెలిమి కొనసాగుతున్నంత కాలం తమకేమీ ఢోకా లేదన్న ధీమాతో ఉన్నారు. తమ ఆధిపత్యానికి ఎటువంటి సవాలు ఎదురైనా, దానిని హిందూత్వ శక్తులు అణచివేయగలవన్న నమ్మకంతో వారున్నారు. తమవద్ద ఎంత సంపద పోగుబడినా ఎటువంటి ముప్పూ రాదని వారు భావిస్తున్నారు. వారసత్వ పన్ను విషయంలో హిందూత్వ శక్తులు స్పందించిన తీరు చూస్తే బూర్జువా వర్గం ఎందుకంత ధీమాగా ఉందో బోధపడుతుంది.

ఆర్థిక అసమానతలను తగ్గించే పోరాటాన్ని ప్రారంభించడానికి సంపద పన్ను విధించడం (సంపద ఎంత ఎక్కువ ఉంటే అంత ఎక్కువ రేటు పన్ను శాతం ఉండేవిధంగా), తద్వారా లభించే ఆదాయాన్ని ఉపయోగించి పేదలకు ప్రయోజనం చేకూర్చేలా వారికి కొన్ని సార్వత్రిక ఆర్థిక హక్కులు కల్పించడం సరైన మార్గం. ఈ సంగతి ఎవరికైనా సులువుగానే బోధపడుతుంది.

కొంతకాలం కిందట మేము వేసిన అంచనాల ప్రకారం పేదలకు అయిదు రకాల సార్వత్రిక ఆర్థిక హక్కులను (విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి, పెన్షను) కల్పించడానికి కావలసిన ఆర్థిక వనరులను సమీకరించాలంటే సంపద పన్ను 2 శాతం గాను, మూడవ వంతు సంపదను వారసత్వ పన్ను గాను విధిస్తే, అది కూడా కేవలం భారతదేశంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం ధనికుల మీద మాత్రమే విధిస్తే సరిపోతుందని నిర్ధారించాం. మన దేశంలో రూ.10 కోట్లు దాటి సంపద కలిగివున్న వారందరి మీదా 2 శాతం సంపద పన్ను, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే పెరుగుతున్న ఆర్థిక అసమానతల వలన వచ్చే ముప్పును నివారించవచ్చునని థామస్ పికెటీ, అతడి సహచరులు కొంతకాలం నుండీ చెప్తూ వస్తున్నారు. సంపద పన్ను ఒక్కటే విధిస్తే అనేక మార్గాల ద్వారా ఆ పన్ను చెల్లించకుండా ఎగ్గొట్టే మార్గాలు దొరుకుతాయి. అదే సంపద పన్నుతో బాటు వారసత్వ పన్ను కూడా విధిస్తే ఆ విధంగా ఎగ్గొట్టడానికి సాధ్యంకాదు.

పెట్టుబడిదారీ సిద్ధాంత ప్రాతిపదికన చూసినా, వారసత్వ పన్ను విధించడం సమర్ధనీయమే. తన కష్టంతో, చొరవతో పెట్టుబడిదారుడు సంపదను కూడగట్టగలుగుతాడు అన్నది పెట్టుబడిదారీ వర్గపు వాదన. అటువంటి కష్టార్జితాన్ని ఎంతవరకైనా ఆ పెట్టుబడిదారుడు పోగేయవచ్చు. ఐతే, పెట్టుబడిదారుడు తన కష్టంతో సేకరించిన సంపద అతడి తదనంతరం, అతడి సంతతికి చెందుతుంది. అతడి సంతానం ఎటువంటి కష్టమూ పడకుండానే, ఎటువంటి చొరవనూ చూపకుండానే, తేరగా తండ్రి సంపాదించిన సంపదకి హక్కుదారులు అవుతారు. ఇలా కష్టపడకుండా సంపదమీద హక్కు పొందడం పెట్టుబడిదారీ సిద్ధాంతానికే వ్యతిరేకం కాదా? అందుకే చాలా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మరణానంతర పన్నుల రూపంలో గణనీయంగా వారసత్వ పన్ను వసూలు చేస్తున్నారు. ఉదాహరణకి జపాన్‌లో వారసత్వ పన్ను 55 శాతం ఉంది. కాని చాలా దిగ్భ్రాంతి గొలిపే విషయం ఏమంటే మన దేశంలో ఎటువంటి వారసత్వ పన్నూ అమలులో లేదు!

ఏ మాత్రమూ వామపక్ష వాసనలు లేనివారు, నయా ఉదారవాద ఎజెండాని ఏ మాత్రమూ వ్యతిరేకించనివారు సైతం ఈ అసంగతమైన పరిస్థితిని గ్రహిస్తున్నారు. టెక్నాలజీయే సర్వస్వం అని భావించే శామ్ పిత్రోడా (విదేశాల్లో నివసించే కాంగ్రెస్ నేత) సైతం ఇటీవల వారసత్వ పన్ను ఆవశ్యకతను గురించి ప్రస్తావించాడు. అంతే, అతడిమీద బిజెపి నేతలు అమాంతం విరుచుకుపడ్డారు. ఇక మన దేశంలోని అతి సంపన్నుల సంగతి సరేసరి. వారు తమకేదో ముంచుకు వచ్చేస్తోందన్నట్టు భయపడిపోయారు. ఇక తమను రక్షించేది ఆ బిజెపి మాత్రమే నని ఎదురుచూశారు. ఐతే, బిజెపి వారసత్వ పన్నును వ్యతిరేకించిన తీరు ఇక్కడ ప్రత్యేకంగా గమనించాలి. వారసత్వ పన్నును అమలు చేయడం కష్టసాధ్యం అనో, పెట్టుబడిదారుల చొరవను అది దెబ్బ తీస్తుందనో, వారిని నిరుత్సాహ పరుస్తుందనో, లేకపోతే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆ పన్ను విధింపుతో భయపడి మన దేశం నుండి బైటకు తరలిపోతుందనో, విదేశీ చెల్లింపుల లోటు పెరిగిపోతుందనో...ఈ మాదిరి వాదనలను బిజెపి చేయలేదు. దానికి బదులు పచ్చి మతోన్మాద-ఫాసిస్టు వాదనలతో విరుచుకుపడింది. హిందువుల నుండి సంపదను కొల్లగొట్టి ముస్లింలకు కట్టబెట్టడానికే వారసత్వ పన్ను ప్రతిపాదనను ముందుకు తెచ్చారంటూ అత్యంత బూటకపు వాదన చేసింది. ఆ వాదనకు కొంత సెంటిమెంటును కూడా జోడించడానికి హిందూ మహిళల తాళిబొట్లను సైతం లాగేసుకుని మన దేశంలోకి అక్రమంగా చొరబడిన వారికి (ముస్లింలు అని పరోక్షంగా) దోచిపెడతారని ప్రచారం చేసింది.

ఇదెంత తప్పుల తడక ప్రచారమో వేరే చెప్పనక్కరలేదు. వారసత్వ పన్ను అనేది మతం బట్టి విధించేది కాదు. వారసత్వంగా సంక్రమించిన సంపద బాగా ఎక్కువగా ఉన్న సందర్భంలో మాత్రమే ఇది వర్తిస్తుంది. కాని బిజెపి మాత్రం ఈ పన్నును మత ప్రాతిపదికన విధిస్తారని ప్రచారం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తాను చేసినది అర్థంలేని వాదన అని బిజెపి కి కూడా ఆ తర్వాత అర్థం అయినట్టుంది. అందుకే తమ ప్రచారాన్ని కొంత మార్చారు. గతంలో ఔరంగజేబు ముస్లిమేతరుల మీద జజియా పన్ను విధించి మాదిరిగానే ఈ వారసత్వ పన్ను ఉంటుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ అన్నారు. ఇది కూడా మతవిద్వేష ప్రచారమే.

నరేంద్ర మోడీకి గాని, ఆదిత్యనాథ్‌కి కాని వారసత్వపన్ను అంటే ఏమిటో తెలియకపోవడం వల్లనే ఆ విధంగా ప్రకటనలు చేశారని అనుకోలేం. హిందువుల సంపదమీద పన్ను విధించి ముస్లింలకు కట్టబెట్టబోతున్నారన్న వారి తప్పుడు ప్రచారం పనిగట్టుకుని చేసినదే. చర్చను మత ప్రాతిపదిక వైపు మళ్ళించడం ద్వారా వాళ్ళు ఈ దేశంలోని అత్యంత సంపన్నులను కాపాడాలని ప్రయత్నిస్తున్నారు. ఆ విధంగా కార్పొరేట్లను కాపాడడంతోబాటు, మైనారిటీలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా, తమ ప్రత్యర్థి రాజకీయ పార్టీ ఆ మైనారిటీలను బుజ్జగించే రాజకీయాలను నడుపుతోందన్న తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేలా బిజెపి తన ప్రచారాన్ని కొనసాగించింది.

> హిందువుల సంపదమీద పన్ను విధించి ముస్లింలకు కట్టబెట్టబోతున్నారన్న వారి తప్పుడు ప్రచారం పనిగట్టుకుని చేసినదే. చర్చను మత ప్రాతిపదిక వైపు మళ్ళించడం ద్వారా వాళ్ళు ఈ దేశంలోని అత్యంత సంపన్నులను కాపాడాలని ప్రయత్నిస్తున్నారు. ఆ విధంగా కార్పొరేట్లను కాపాడడంతోబాటు, మైనారిటీలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా, తమ ప్రత్యర్థి రాజకీయ పార్టీ ఆ మైనారిటీలను బుజ్జగించే రాజకీయాలను నడుపుతోందన్న తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేలా బిజెపి తన ప్రచారాన్ని కొనసాగించింది.
> ఒకే దెబ్బకు మూడు పిట్టల్ని కొట్టడానికి పనికొచ్చేలా బిజెపి వారసత్వ పన్ను ప్రతిపాదన విషయంతో తన ప్రచారాన్ని చేపట్టింది. మొదటిది: మైనారిటీల మీద విద్వేషాన్ని మరింత రెచ్చగొట్టడం. రెండోది: ప్రతిపక్ష పార్టీని దుయ్యబట్టడానికి దీనిని ఒక సాధనంగా వాడుకోవడం, మూడోది: వారసత్వ పన్ను ప్రతిపాదనను మొగ్గలోనే తుంచెయ్యడం, తద్వారా తమ ప్రధాన పోషకులైన అతి సంపన్నులను కాపాడుకోవడం. మతతత్వ- ఫాసిస్టు శక్తులు ఈ విధమైన తప్పుడు ప్రచారాల వ్యూహాలలో అందె వేసిన చెయ్యి.

ఒకే దెబ్బకు మూడు పిట్టల్ని కొట్టడానికి పనికొచ్చేలా బిజెపి వారసత్వ పన్ను ప్రతిపాదన విషయంతో తన ప్రచారాన్ని చేపట్టింది.

మొదటిది: మైనారిటీల మీద విద్వేషాన్ని మరింత రెచ్చగొట్టడం.

రెండోది: ప్రతిపక్ష పార్టీని దుయ్యబట్టడానికి దీనిని ఒక సాధనంగా వాడుకోవడం.

మూడోది: వారసత్వ పన్ను ప్రతిపాదనను మొగ్గలోనే తుంచెయ్యడం, తద్వారా తమ ప్రధాన పోషకులైన అతి సంపన్నులను కాపాడుకోవడం. మతతత్వ-ఫాసిస్టు శక్తులు ఈ విధమైన తప్పుడు ప్రచారాల వ్యూహాలలో అందె వేసిన చెయ్యి.

ఒక ప్రజాస్వామ్య సమాజంలో ప్రజా జీవితానికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ ప్రజలు ఏది మంచో, ఏది చెడో గ్రహించగలుగుతారని, తదనుగుణంగా తమ వైఖరులు తీసుకుంటారని మామూలుగా అందరూ భావిస్తారు. కాని ఒక దోపిడీ సమాజంలో ఆ ప్రజలను పనిగట్టుకుని విషయాలను గ్రహించలేని స్థితిలోకి పాలక వర్గాలు నెడతాయి. అందుచేత వాస్తవ సమస్యలను వారు చర్చించి నిర్ణయించే శక్తిని కోల్పోతారు. అందుకే మార్క్సిస్టు సిద్ధాంతం మేధావులకు ఒక కర్తవ్యాన్ని నిర్దేశించింది. తామే వర్గానికి చెందినవారైనప్పటికీ, ఆ వర్గ స్వభావాన్ని అధిగమించి కార్మికవర్గ దృక్పథంతో మేధావులు ఆ శ్రామిక ప్రజానీకానికి సిద్ధాంతాన్ని చేరువగా తీసుకురావాలని ఆదేశించింది. ఐతే, ఆ విధంగా కార్మికవర్గానికి ప్రత్యక్షంగా తోడ్పడే మేధావులతోబాటు మరికొందరు మేధావులు కూడా ఉన్నారు. వాళ్ళు సమాజాన్ని వర్గ కోణం నుండి చూడరు. కాని ప్రజలకు విషయాలన్నీ తెలియాలని, అప్పుడే ప్రజాస్వామ్యం బాగా పనిచేస్తుందని నమ్మే బూర్జువా మేధావులు వారు. ఉదాహరణకు బూర్జువా మేధావి అయిన జాన్ మేనార్డ్ కీన్స్ ప్రజాస్వామ్యం బాగా పనిచేయాలంటే అందుకు విద్యావంతులైన బూర్జువాలు అవసరం అని భావించాడు. అటువంటి బూర్జువా విద్యావంతులైనా, వారసత్వ పన్ను గురించిన చర్చ జరిగితే, అది మతంతో ముడిపడిన విషయం కాదనే చెప్తారు. కాని ప్రస్తుత చర్చలో నయా ఫాసిస్టు శక్తుల వాదనే ఎక్కువగా ప్రచారం పొందిందంటే (అది వట్టి బూటకపు వాదన అయినప్పటికీ), రాజకీయాలలో ఫాసిస్టు శక్తుల ఆధిపత్యాన్ని అది సూచిస్తుంది. "విద్యావంతులైన బూర్జువాలు" తమ బాధ్యతలను త్యజించారని అది సూచిస్తుంది.

"విద్యావంతులైన బూర్జువాలు" బలహీనపడడం, సంఖ్యాపరంగా కూడా తగ్గిపోవడం ఎవరూ కాదనలేని నిజం. వారసత్వ పన్ను అనేది మత ప్రాతిపదికన విధించేది అని బిజెపి అగ్రనేతలు జంకూ గొంకూ లేకుండా ప్రచారం చేసుకుపోతూ వుంటే, మీడియా దానిమీద ఏ మాత్రమూ నోరు మెదపలేదు. బూర్జువా మేధావులు అదృశ్యమైపోయారని, గోడీ మీడియా మాత్రమే చెలామణీ అవుతోందని స్పష్టం అవుతోంది.

ఇలా ఎందుకు జరుగుతోంది? "విద్యావంతులైన బూర్జువాలు" కూడా బూర్జువా వర్గంలో ఒక అంతర్భాగమే. ఒక బూర్జువా సమాజం ప్రజాస్వామ్య ప్రాతిపదికన నడుస్తున్నప్పుడు మాత్రమే ఈ తరగతి తమ పాత్ర విషయంలో స్పష్టత కలిగివుంటారు. ప్రజాస్వామ్యం బలహీనపడి, సమాజం ఫాసిస్టు శక్తుల పెత్తనం లోకి పోయిందంటే నయా ఉదారవాద వ్యవస్థ ముందు దారి మూసుకుపోయిందని అర్థం. ఇటువంటి పరిస్థితిని కీన్స్ కాలంలో ఊహించడం సాధ్యం కాదు. అందుకే కీన్స్ కోరుకున్నట్టు పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే వర్గ పోరాటాలు బలపడకుండా తగు చర్యలు చేపట్టి, పెట్టుబడిదారీ వ్యవస్థను శాశ్వతంగా కాపాడుకోగలగడం అనేది ఇప్పుడు సాధ్యం కాని విషయం.

(స్వేచ్ఛానుసరణ)

సెటైర్

టెన్షన్ - అటెన్షన్

కప్పు మీద కప్పు మ్యాచులు జరుగుతూ ఉన్నాయి. ఐ.పి.ఎల్ ఐపోయింది. ఇప్పుడు ఐ.సి.సి. ప్రపంచ కప్పు మొదలవబోతోంది. క్రికెట్టే కాదు, బ్యాడ్మింటన్, హాకీ, టెన్నిస్, చదరంగం ఇలా ప్రతి సంవత్సరం ఎన్నెన్నో పోటీలు, కప్పులు జరుగుతూ ఉంటాయి. కప్పును గెలిచే వాళ్ళు గెలుస్తుంటారు, ఓడేవాళ్ళు తరువాత సంవత్సరం తప్పకుండా గెలవాలి అనుకొని ఇళ్ళకు పోతారు. అలా అనుకొని ఇంటికిపోయి నిద్రపోతే సరిపోదు. సంవత్సరమంతా శ్రమించాలి, గెలుపుకై తహతహలాడాలి. అన్ని శక్తులూ కలుపుకొని అంతకు ముందు కంటే పోటీనివ్వాలి. అప్పుడు తరువాత సంవత్సరం కప్పుపై ఆశ పెట్టుకోవాలి. లేదంటే ఈ వాయిదా ప్రతి సంవత్సరం, నాలగు లేదా ఐదేళ్లకొకసారి జరుగుతూనే ఉంటుంది. ఏ జట్టు గెలుస్తుంది అన్న టెన్షన్ చాలామందికుంటుంది. అక్కడే ముఖ్యమైన విషయాల మీద అటెన్షన్ కోల్పోతారు. అలాంటి ఒత్తిడిని పెంచి మన ధ్యాసను పక్కకు తిప్పడమే ఈ టెన్షన్‌ల ఉద్దేశ్యం. ఇక్కడే మనం జాగ్రత్త వహించాలి.

టీ ట్వెంటీ క్రికెట్ ప్రపంచ కప్ అంటే ఇరవై ఇరవై ఓవర్ల ప్రపంచ కప్పు మొదలవబోతోంది. దాని గురించి రాసి రాసి, చూపించి చూపించి ఆసక్తి పెంచుతారు మీడియా వాళ్ళు. అందులో భాగంగానే భారత్ ఫేవరేట్‌గా రంగంలోకి దిగుతోంది అని రాస్తారు ఒక పేపర్లో. ఈసారి ఇండియాకే కప్పు గెలిచే అవకాశం ఉంది అని ఇంకో పేపర్లో రాస్తారు. రెండూ ఒకే అర్థంగా కనిపిస్తాయి చదివేటోళ్ళకు. ఇప్పుడు భారత్, ఇండియా అంటే ఒకటి కాదని, రెండూ వేరువేరనీ జనాల మెదళ్ళలో నూరిపోశారు మన నాయకులు. భారత్ తప్పకుండా గెలుస్తుంది అంటే కాదు కాదు ఇండియానే తప్పకుండా గెలుస్తుంది అంటారింకొందరు. మనం తల పట్టుకొని ఇదేమిరా దేశంలో ప్రజల్ని విడగొట్టడం ఒకటైతే దేశం పేరును కూడా ఇలా రాజకీయం చేసి తమాషా చూస్తున్నారా అని మనకే ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ టెన్షన్‌కు కారణం ఒక ఫేవరేట్ జట్టును ఊహించుకోవడం. ఫేవరేట్ జట్టంటే ఇష్టమైన జట్టు. ప్రతి ఒక్కరికి ఒకటుంటుంది. మనిషిని బట్టి, మీడియా ఐతే పేపరు, టీవీ ఇలా ఎవరికి వారు "ఇష్టులు" ఉంటారు. ఐనా మధ్య మధ్యలో ఇంకో జట్టునూ తీసివేయలేము, ఫలానా జట్టుకి కూడా గెలిచే అవకాశముంది అంటూ ఉంటారు. అండర్ డాగ్ జట్లూ ఉంటాయి. అండర్ డాగ్ అంటే ఏ మాత్రం కప్పు గెలిచే అవకాశం లేని జట్టు అని అందరికీ తెలుసు. చెప్పలేము 1983లో అండర్ డాగ్‌గా ప్రవేశించిన కపిల్ సారథ్యంలోని భారత జట్టు అదేనండి ఇండియా జట్టు ఏకంగా ప్రపంచ కప్పునే తీసుకొచ్చింది. అదీ ఫైనల్ మ్యాచులో రెండుసార్లు ప్రపంచ కప్పు గెలిచిన వెస్ట్ ఇండీస్ జట్టు మీద గెలిచి. పెద్ద పెద్ద స్టార్లనబడే వాళు ్ళ ఈ కప్పులో అరివీర భయంకరంగా ఆడి కప్పు తేవడం జరగలేదు. ఇండియా కంటే అండర్ డాగ్ జట్టు జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టుకు ముచ్చెమటలు పట్టిస్తే... నాయకుడు కపిల్ దేవ్ 175 కొట్టి మ్యాచ్ గెలిచి ఫైనల్ దాకా తీసుకొచ్చాడు. ఫైనల్ మ్యాచులో అమర్‌నాథ్, మదన్ లాల్ లాంటి వారు ఎదురుగా వెస్ట్ ఇండీస్ బౌలర్లు వేసే బంతులను భయపడకుండా ఎదుర్కొని, తరువాత వాళ్ళ వికెట్లు కూడా పడగొట్టి కప్పును ముద్దాడేలా చేశారు. ఇదంతా చెప్పడమెందుకంటే పెద్ద పెద్ద స్టార్లనబడే వాళ్ళు ఏమీ చేయలేరు ఒక్కొక్క సారి. ఫేవరేట్ ఐనా అండర్ డాగ్ ఐనా జట్టంతా సమైక్యంగా ఆడితేనే టెన్షన్ వదిలేసి గెలుస్తారన్న మాట మాత్రం వాస్తవం. మొన్నామధ్య కపిల్ దేవ్ కాలేజి పిల్లలకు విషయాలు చెబుతూ మనకిష్టమైన పని చేస్తుంటే టెన్షన్ ఎందుకొస్తుంది అని ఒక ప్రశ్న వేశాడు. నిజమే కదా!

రెండుసార్లు ప్రపంచ కప్పు గెలిచిన జట్టు మూడోసారీ ముచ్చటగా హ్యాట్రిక్ చేస్తుందని ఊహలు గుసగుసలాడించేసి పేపర్లు నింపిన వారికి, చర్చలు పెట్టి నమ్మబలికించిన వారికి ఆ హ్యాట్రిక్ తప్పిపోయినప్పుడు పెద్ద షాకే తగులుతుంది. అలాంటి షాకులు క్రీడాకారులిస్తారు, ప్రజలూ ఇస్తారు. ప్రజల అటెన్షన్ పక్కకు మరల్చడమే వాళ్ళ ముఖ్య ఉద్దేశ్యం. "రాక్షసత్వం పోయి, రాచరికములు పోయి, ప్రజలదే పైచేయి, ఓ కూనలమ్మ" అని ఆరుద్రగారి కూనలమ్మ పదాలు పాడుకోవాలప్పుడు. అలాగే ఎవరిని నమ్మకూడదో చెప్పిన పాత కూనలమ్మ పదాలూ ఉన్నాయి "ఆడి తప్పిన వాని, నాలి నేలని వాని, నాదరించుట హాని, ఓ కూనలమ్మ", ఇది ఎవరు రాశారో కాని ఆరుద్ర గారికి నచ్చినది.



> స్వాతంత్ర్యం వచ్చి ఢిల్లీలో వేడుకలు చేసుకుంటుంటే గాంధీజీ అటెన్షన్ మాత్రం కలకత్తా మీద ఉంది. దేశ విభజన వేళ మతపరమైన అల్లర్లు జరుగకుండా అక్కడ తానే స్వయంగా ఉండి మరీ పరిస్థితి చేయి దాటిపోకుండా చూశాడు. నాయకుడంటే అలా ఉండాలి. అంతెందుకు సుందరయ్య లాంటి నాయకులు కూడా ప్రజల కోసం ఇలాగే పనిచేశారు. నిన్న ఎగ్జిట్ పోల్స్ మీద ధ్యాసతో అన్ని పార్టీలవారూ టెన్షన్‌తో ఉంటే సీతారాం ఏచూరి, బృందా కరత్ పాలస్తీనాలో మారణహోమం ఆపాలంటూ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ర్యాలీ తీశారు. శ్వాశ మీద ధ్యాసలాగా ప్రజలే శ్వాశగా ఉన్నవాళ్ళు ఇలాగే ఉంటారు.

గాంధీ గురించి ఎవరికిష్టమొచ్చింది వాళ్ళు చెబుతున్నారిప్పుడు. అసలు స్వాతంత్ర్యం వచ్చి ఢిల్లీలో వేడుకలు చేసుకుంటుంటే గాంధీజీ అటెన్షన్ మాత్రం కలకత్తా మీద ఉంది. దేశ విభజన వేళ మతపరమైన అల్లర్లు జరుగకుండా అక్కడ తానే స్వయంగా ఉండి మరీ పరిస్థితి చేయి దాటిపోకుండా చూశాడు. నాయకుడంటే అలా ఉండాలి. అంతెందుకు సుందరయ్య లాంటి నాయకులు కూడా ప్రజల కోసం ఇలాగే పనిచేశారు. నిన్న ఎగ్జిట్ పోల్స్ మీద ధ్యాసతో అన్ని పార్టీలవారూ టెన్షన్‌తో ఉంటే సీతారాం ఏచూరి, బృందా కరత్ పాలస్తీనాలో మారణహోమం ఆపాలంటూ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ర్యాలీ తీశారు. శ్వాశ మీద ధ్యాసలాగా ప్రజలే శ్వాశగా ఉన్నవాళ్ళు ఇలాగే ఉంటారు. ప్రజలంటే ఓట్లు అనుకొని చూసేవాళ్ళు ఇంకో విధంగా ఉంటారు.

ఎగ్జిట్ పోల్సుని కూడా రీపోలింగ్ చేయించాలని వాట్సప్పులో నిన్న జోక్ ఒకటొచ్చింది. ఎవరి సంస్థలు వారివి కదా! అందుకే వాటి ఫలితాలు రకరకాలుగా ఉన్నాయి. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ప్రజల గురించి ఆలోచించే వాళ్ళ అటెన్షన్ ఎప్పుడూ ప్రజా సమస్యల పైనే ఉంటుంది. టెన్షన్ అటెన్షన్ రెండూ రెండు కళ్ళలా సింహాసనం మీద ఉండేవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. అందుకే టెన్షన్లోనైనా మన అటెన్షన్ కోల్పోకూడదు. మన శ్రద్ధ ఎప్పుడూ ప్రజలపైనే వుండాలి.

\- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

అభిప్రాయం

ఎవరు గెలిచినా...!

ఎవరు గెలిచినా చెత్త పన్ను తీసెయ్యాలి.
ఎవరు గెలిచినా కరెంటు రేట్లు తగ్గించాలి.
ఎవరు గెలిచినా ఒకటో తేదీకి వృద్ధాప్య పెన్షను ఇవ్వాలి.
ఎవరు గెలిచినా అన్నా క్యాంటీన్ తెరవాలి.
ఎవరు గెలిచినా ముఖ్యమంత్రి వస్తుంటే చెట్లు కొట్టెయ్యకూడదు.
ఎవరు గెలిచినా మంత్రుల ప్రయాణంలో ట్రాఫిక్ జాం చెయ్యకూడదు.
ఎవరు గెలిచినా ప్రశ్నిస్తే అరెస్టు చెయ్యరాదు.
ఎవరు గెలిచినా ప్రభుత్వ కార్యాలయాలలో పని త్వరగా జరిగేటట్లు, లంచం తీసుకోకుండా పనులు జరిగేటట్లు అదేశాలు ఇవ్వాలి.
ఎవరు గెలిచినా గతంలో మాదిరి ప్రభుత్వ కార్యాలయాలలో వాస్తు పేర జరిగే డబ్బు దుర్వినియోగాన్ని ఆపాలి.
ఎవరు గెలిచినా దొంగబాబాల ఆశ్రమాల గుట్టు రట్టు చేయాలి.
ఎవరు గెలిచినా విశాఖలో స్వరూపానందకు ఇచ్చిన భూముల జీవో రద్దు చెయ్యాలి.
ఎవరు గెలిచినా ముడు సంవత్సరాల క్రితం దొంగ రామదూత ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరి ఇచ్చిన ఆదేశాలు అమలుపరచాలి.
ఎవరు గెలిచినా దొంగబాబాల ఆశ్రమాల చుట్టూ మంత్రులు, ఐఎఎస్ లు, ఐపీఎస్ లు తిరగకుండా, రాజ్యాంగంలో రాసుకున్న లౌకికవాదాన్ని రక్షించాలి.
ఎవరు గెలిచినా దొంగబాబాలు ఇప్పటికే ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలి.
ఎవరు గెలిచినా మూఢనమ్మకాల నిర్మూలనకు ఒక చట్టం కర్ణాటక, మహారాష్ట్రలో మాదిరి తీసుకురావాలి.

\- నార్నె వెంకట సుబ్బయ్య

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

గాజాలో 40మంది మృతి

- రఫాను వీడిన పది లక్షలమందికి పైగా ప్రజలు
- సిరియా సిటీపై ఇజ్రాయిల్ దాడులు

గాజా, బీరుట్ : గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల్లో భాగంగా గత 24గంటల్లో జరిగిన దాడుల్లో 40మంది మరణించారు. ఈ దాడుల కారణంగా ఇప్పటికే రఫా నుండి పది లక్షలమందికి పైగా ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లు అంతర్జాతీయ న్యాయ స్థానం నుండి అరెస్టు వారంట్లు ఎదుర్కొనే అవకాశం వుందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో తాజా కాల్పుల విరమణ ఒప్పంద ప్రతిపాదనపై సందేహాలు పెరుగుతున్నాయి. ఈ కాల్పుల విరమణ ప్రణాళికను హమాస్ ప్రతినిధి ఒసామా హమ్‌దాన్ స్వాగతించినప్పటికీ రాతపూర్వకంగా ఎలాంటి పత్రాలు అందలేదని చెప్పారు.

మిలటరీ ఆపరేషన్స్ ముగించుకుని ఇజ్రాయిల్ మిలటరీ బయటకు వచ్చేసిన తర్వాత జబాలియా, బీట్ హనూన్ ప్రాంతాలను విపత్తు ప్రాంతాలుగా ప్రకటించారు. ఇదిలావుండగా, 3500మందికి పైగా చిన్నారులు సరైన ఆహారం లేక మృత్యు ముంగిట వున్నారని పాలస్తీనా ప్రభుత్వం ప్రకటించింది. రఫా, గాజాలకు పంపిస్తున్న మానవతా సాయం పూర్తి స్థాయిలో అందకుండా ఇజ్రాయిల్ కట్టడి చేస్తుండడంతో అక్కడ దుర్భరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటివరకు 36,479మంది పాలస్తీనియన్లు మరణించగా, 82,777మంది గాయపడ్డారు.

అలెప్పోపై ఇజ్రాయిల్ దాడులు

సిరియా నగరమైన అలెప్పోపై ఇజ్రాయిల్ వైమానిక దాడులతో సోమవారం విరుచుకుపడింది. ఈ దాడిలో పలువురు మరణించారని సిరియా ప్రభుత్వ మీడియా సానా వెల్లడించింది. ఆస్తి నష్టం కూడా ఎక్కువగానే జరిగిందని సానా తెలిపింది. ఈ దాడులపై ఇజ్రాయిల్ వెంటనే స్పందించలేదు.

పుల్వామాలో ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. జిల్లాలోని నిహమా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్న భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు తీవ్రవాదులు మరణించారని పోలీసు అధికారులు తెలిపారు. మరణించిన వారిని, వారి సంస్థను నిర్ధారించాల్సి ఉందని కాశ్మీర్ ఐజి వికె బీర్ధి మీడియాకు తెలిపారు.

గూఢచర్యం కేసులో బ్రహ్మోస్ మాజీ ఇంజనీర్‌కు జీవితఖైదు

నాగ్‌పూర్ : గూఢచర్యం కేసులో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఇంజనీర్ నిశాంత్ అగర్వాల్‌కు జీవితఖైదు, రూ.3 వేలు జరిమానా విధించారు. అధికారిక రహస్యాల చట్టం (ఒఎస్ఎ) ప్రకారం ఈ శిక్షలను నాగ్‌పూర్ జిల్లా కోర్టు సోమవారం విధించింది. పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ కోసం నిశాంత్ అగర్వాల్ గూఢచర్యానికి పాల్పడినట్లు ఒఎస్ఎలోని వివిధ సెక్షన్లతోపాటు, ఐటి చట్టంలోని సెక్షన్ 66 (ఎఫ్) కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిశాంత్‌ను 2018లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన మిలటరీ ఇంటెలిజెన్స్ యాంటీ టెర్రరిజం (ఎటిఎస్) సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్టు చేశాయి. బ్రహ్మోస్ ఏరోస్పేస్ రష్యాకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ), మిలిటరీ ఇండస్ట్రియల్ కన్సార్టియం (ఎన్‌పిఒ మషినోస్ట్రోయెనియా) యొక్క సంయుక్త సంస్థ. ఈ సంస్థకు చెందిన నాగ్‌పూర్‌లోని క్షిపణి కేంద్రంలో సాంకేతిక పరిశోధన విభాగంలో నిశాంత్ నాలుగేళ్ల పాటు ఉద్యోగిగా పని చేశారు.

పాలస్తీనాకు మద్దతు తెలపడమే నేరమా !

- భారత సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకున్న మితవాద మూకలు
- వేధింపులు, బెదిరింపులతో ట్రోలింగ్



న్యూఢిల్లీ : గత 8 మాసాలుగా గాజాలో సాగుతున్న నరమేధంపై ప్రపంచ ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అక్కడ తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, శాశ్వతంగా శాంతిని నెలకొల్పాలని అంతర్జాతీయ న్యాయస్థానం, ఐక్యరాజ్య సమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలు ఆదేశాలు, విజ్ఞప్తుల రూపంలో ఎన్నిసార్లు కోరినా ఇజ్రాయిల్ మొండిగా తిరస్కరిస్తూ వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా మే 26న రఫాలోని నిర్వాసితులు తలదాచుకున్న తాత్కాలిక శిబిరంపై ఇజ్రాయిల్ ఆర్మీ విరుచుకుపడింది. ఆ ఘటనలో 45మంది మరణించారు. పెద్ద ఎత్తున చెలరేగిన మంటలు, మాడిపోయి గుర్తుపట్టడానికి కూడా వీలులేని విధంగా పడి ఉన్న మృతదేహాలు, తల లేని పిల్లాడి మృతదేహం వంటి భయానకమైన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇజ్రాయిల్ దాష్టీకాలపై ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి... "ఆల్ ఐస్ ఆన్ రఫా" పేరుతో ఎఐ సృష్టించిన గ్రాఫిక్ బాగా వైరల్ అయింది. 4కోట్ల సార్లకు పైగా దీన్ని షేర్ చేసుకున్నారు.. సోషల్ మీడియా వేదికగా సాగిన ఈ ప్రచారంలో పలువురు అంతర్జాతీయ సెలబ్రిటీలతో సహా భారత్ సెలబ్రిటీలు పలువురు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు. సోషల్ మీడియా యూజర్లు ముఖ్యంగా సెలబ్రిటీలు ఈ ట్రెండ్‌ను ఫాలో అయ్యారు.

ఈ నేపథ్యంలో పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్ తీరును ఖండిస్తూ ఆ గ్రాఫిక్‌ను ఇతరులతో పంచుకున్న భారత సెలబ్రిటీలను మితవాద విభాగానికి చెందిన ఇన్‌ఫ్లూయన్సర్లు, ప్రచారకర్తలు లక్ష్యంగా చేసుకున్నారు. వారిని రకరకాలుగా బెదిరించారు. ఆన్‌లైన్ వేదికగా వేధింపులకు గురి చేశారు. ఇప్పుడు రఫాపై ఇంతలా గళమెత్తి ప్రశ్నిస్తున్న వారు గతంలో పాకిస్తాన్‌లో హిందువులపై జరిగిన వేధింపుల సమయంలో, అలాగే కాశ్మీరీ పండిట్లపై జరిగిన దాడులు, వేధింపులపై ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నిస్తున్నారు. పైగా ఆల్ ఐస్ ఆన్ రఫా అన్న గ్రాఫిక్‌లో రఫా స్థానంలో పిఒకె, పాకిస్తానీ హిందూస్ అనే పదాలను చేర్చి ఆన్‌లైన్‌లో ప్రచారం చేశారు. మరికొంతమంది రఫాపై వ్యక్తమవుతున్న సంఘీభావాన్ని కూడా మీమ్స్ రూపంలో తీసుకువచ్చారు.

ఇందుకు సంబంధించి కొన్ని ఉదాహరణలు చూద్దాం :

భారత్ క్రికెట్ టీమ్ కెప్టెన్ రోహిత్‌శర్మ భార్య రితికా సజ్దా ఈ గ్రాఫిక్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన మితవాదుల ట్రోలింగ్‌ను భరించలేక దాన్ని తొలగించారు.

తప్పుడు సమాచారాన్ని తన సోషల్ మీడియా వేదికగా తరచుగా ప్రచారం చేసే దీపక్ శర్మ అనే వ్యక్తి రోహిత్ శర్మకు, భార్య రితికకు హెచ్చరిక చేశారు. 'తీవ్రవాదులు, ఆటవిక కృత్యాలకు పాల్పడుతున్న వారికి మద్దతుగా పోస్టులు పెడుతూ నీ భార్య తప్పు చేస్తోంది. ఏదో నాలుగు రూపాయలు సంపాదించుకోవడానికా ఆమె ఇలాంటి పోస్టులు పెడుతోంది, ఆమెకు నువ్వు డబ్బులు ఇవ్వడం లేదా అంటూ తీవ్ర పదజాలంతో ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఇది మొదటి తప్పు అనుకుని క్షమించి వదిలేస్తున్నాం, మరోసారి జరిగితే తీవ్ర పర్యవసానాలు వుంటాయని బెదిరిస్తున్నారు.

భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్ కూడా ఇదే గ్రాఫిక్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేశారు. వెంటనే మితవాద మూకలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. మోనా ఎట్ లేడీ నేషనలిస్ట్ అనే ఎక్స్ యూజర్ సిరాజ్ పంచుకున్న స్టోరీపై తీవ్రంగా వ్యాఖ్యలు చేశారు. "వారిని మీరు ఎంతగా సొంతం చేసుకున్నా, చివరకు వారు వారి అసలైన స్వభావాన్ని బయటపెట్టుకుంటారు." అని హిందీలో పేర్కొన్నారు. మిగిలిన అనేకమంది సెలబ్రిటీలను కూడా ఈ యూజర్ లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా ముస్లిం కమ్యూనిటీకి చెందినవారిని లేదా ముస్లింలతో సంబంధమున్న వారిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు.

బిజెపి ఎంపి మనోజ్ తివారీ కుమార్తె, ఇటీవలే బిజెపిలో చేరిన రితి తివారీ కూడా ఈ గ్రాఫిక్‌ను షేర్ చేసి పోస్టు పెట్టారు. పిల్లల తలలు కోసి, వారిని సజీవంగా సమాధి చేయడంతో సహా లెక్కలేని అత్యాచారాలు, అకృత్యాలకు పాల్పడుతున్న ఈ దుష్టత్వాన్ని ఖండిస్తూ, అందరిలో చైతన్యం తీసుకురావడానికి మన గళాన్ని వినిపించాలి, మనకు న్యాయం కావాలి, ఇందుకోసం తిరగబడాలి అని పేర్కొన్నారు. మితవాదుల నుండి తీవ్రంగా ధూషణలు రావడంతో తన ఇన్‌స్టా పేజీ నుండి ఆ పోస్టును తొలగించారు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని సమర్ధించేవారు బిజెపిలో వుండడం సిగ్గుచేటైన విషయమంటూ మితవాద ఇన్‌ఫ్లూయన్సర్ షఫాలి వైద్య ఒక వీడియో కూడా షేర్ చేశారు. రితి తివారిని బెదిరిస్తూ అనేకమంది పోస్టులు పెట్టారు.

మరోపక్క బాగా వైరల్ అయిన ఈ గ్రాఫిక్‌నే మరో రకంగా ఉపయోగించుకున్నారు. కర్ణాటకకు చెందిన బిజెపి ఎంపి పి.సి.మోహన్. "(ఆయేగా తో మోడీ హై) మోడీ విల్ బి బ్యాక్" అని మార్చి ఆ గ్రాఫిక్‌ను షేర్ చేశారు. దీన్ని బిజెపి ఎంఎల్‌ఎ అతుల్ భత్కాలక్కర్, మితవాద ఇన్‌ఫ్లూయన్సర్ రిషి బాగ్రీలతో సహా పలువురు యూజర్లు తమ సోషల్ మీడియా హేండిల్‌పై షేర్ చేసుకున్నారు.

సోషల్ మీడియాలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో మే 30న కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పాలస్తీనాపై భారత్ వైఖరిని పునరుద్ఘాటించాల్సి వచ్చింది. . పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలన్నదే భారత్ వైఖరి అని ఆయన చెప్పారు.. గాజాలో దాడులు ప్రారంభమైనప్పటి నుండి బిజెపి, ప్రధాని మోడీ మద్దతుదారులతో సహా మితవాద గ్రూపులు ఇస్లామోఫోబియాను రెచ్చగొట్టడానికి దీన్నొక అవకాశంగా మలుచుకున్నారు. పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ సాగించే యుద్ధ నేరాలకు మద్దతుగా మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. గాజా నరమేథంలో బలైన వారిని కించపరుస్తూ, అమానవీయంగా చిత్రీకరిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు.

రేవ్‌పార్టీ కేసులో సినీ నటి హేమ అరెస్టు

- 14 వరకూ జ్యుడీషియల్ కస్టడీ

బెంగళూరు : రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ కేసులో రెండుసార్లు నోటీసులు ఇవ్వగా.. విచారణకు హేమ హాజరుకాలేదు. తాజాగా మరోసారి నోటీసులు ఇచ్చి.. విచారణ అనంతరం ఆమెను అరెస్టు చేశారు. గత నెలలో బెంగళూరులోని ఓ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇదే పార్టీకి వచ్చిన ఒక కారులో రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్ కూడా దొరికింది.

పార్టీలో పలు రకాల డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. 86 మంది మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు వైద్య పరీక్షల్లో తేలిందని నగర నేర నియంత్రణ దళం (సిసిబి) అధికారులు వెల్లడించారు. 73 మంది పురుషుల్లో 59 మందికి, 30 మంది మహిళల్లో 27 మందికి వైద్య పరీక్షలో డ్రగ్ పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. అరెస్టయిన ఆరుగురు నిందితులతో పాటు సినీ నటి హేమ కూడా విచారణకు హాజరుకావాలని సిసిబి పోలీసులు నోటీసులు జారీ చేశారు. తనకు వైరల్ ఫీవర్ వచ్చిందని, విచారణకు హాజరుకాలేనని హేమ బెంగళూరు పోలీసులకు లేఖ రాశారు. హేమ ఈ అభ్యర్ధనను సిసిబి పోలీసులు పరిగణనలోకి తీసుకోలేదు. విచారణకు గైర్హాజరైన హేమకు నోటీసులు పంపి, సోమవారం ఆమెను అరెస్ట్ చేశారు. అనంతరం బెంగళూరులోని జెఎంఎఫ్‌సి కోర్టులో ప్రవేశ పెట్టారు. జడ్జి ఎఎస్ సల్మా ఈ నెల 14 వరకూ హేమకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

పాలు లీటర్‌కు రూ.2 పెంపు

- ప్రకటించిన అమూల్, మదర్ డెయిరీ
- ఖండించిన సిపిఎం, ఐద్వా

న్యూఢిల్లీ : పాల ధరలను లీటరుకు రెండు రూపాయలు పెంచినట్లు అమూల్, మదర్ డెయిరీ సంస్థలు ప్రకటించాయి. గత 15మాసాలుగా ఉపకరణాల వ్యయం పెరిగినందున ఈ ధరలను పెంచాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. అన్ని రకాల పాలకు ఈ ధరల పెంపు వర్తిస్తుందని, పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఢిల్లీ-ఎన్‌సిఆర్ మార్కెట్‌లోనే కాకుండా ఈ పాలు దొరికే ఇతర మార్కెట్లలో కూడా ధరలు పెరుగుతాయని ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఆదివారమే అమూల్ తన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించినా సోమవారం నుండే ఇవి అమల్లోకి వచ్చాయి. మదర్ డెయిరీ సోమవారం ధరల పెంపును ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే అమూల్, మదర్ డెయిరీ సంస్థల నుండి ఈ ప్రకటన వెలువడింది. ఏటికేడాది ఉత్పత్తి వ్యయం పెరిగిపోతున్నందున పాల ధరలను పెంచక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆ సంస్థలు వెల్లడించాయి.

తాజా ధరల పెంపు నేపథ్యంలో మదర్ డెయిరీ పాలకు సంబంధించి ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరు రూ.68కాగా, వైట్ టోన్డ్, డబుల్ టోన్డ్ పాలు రూ.56, 50గా వున్నాయి. గేదె పాలు, ఆవు పాలు వరుసగా లీటరు రూ.72, రూ.58గా వున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్‌సిఆర్ మార్కెట్లో మదర్ డెయిరీ రోజుకు 35లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోంది. సమర్ధవంతమైన 3-4 శాతం సవరణతో క్షేత్ర స్థాయిలో ధరల పెంపు పాక్షికంగా మాత్రమే వినియోగదారులకు బదిలీ అవుతుందని తద్వారా పాల ఉత్పత్తిదారులు, వినియోగదారుల ప్రయోజనాలకు భద్రత కల్పిస్తామని మదర్ డెయిరీ పేర్కొంది.

అమూల్ గేదె పాలు, గోల్డ్ మిల్క్, శక్తి మిల్క్ పాలు వరుసగా అరలీటరు రూ.36, 33, 30గా వున్నాయి. లీటరుకు రూ.2 పెంపుతో ఎంఆర్‌పిలో మూడు నుండి నాలుగు శాతం పెంపు కనిపిస్తుందని, ఇది, సగటు ద్రవ్యోల్బణం కన్నా చాలా తక్కువగానే వుంటుందని గుజరాత్ పాల సహకార మార్కెటింగ్ సమాఖ్య (జిసిఎంఎంఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. వినియోగదారులు చెల్లించే ప్రతి రూపాయిలో దాదాపు 80పైసల వరకు పాల ఉత్పత్తిదారులకు చేరుతుందని పేర్కొంది.

పోలింగ్ ముగిసిన వెంటనే భారాలు : సిపిఎం

అమూల్, మదర్‌డెయిరీ సంస్థలు లీటరు పాల ధరను రూ.2 పెంచడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఎన్నికలు ముగిసేవరకు ప్రభుత్వం వేచి చూసిందని, ఆ వెంటనే ప్రజలపై భారం మోపిందని దీంతో స్పష్టమైందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇంతకుముందే, పోలింగ్ ముగిసిన వెంటనే, రోడ్ టోల్ పన్ను ఐదు శాతం పెంచారని, దీనివల్ల అన్ని సరుకుల ధరలు పెరుగుతాయని, ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు పెరుగుతాయని, మరోవైపు ప్రజల రవాణా వ్యయం కూడా పెరుగుతుందని సిపిఎం పేర్కొంది.

ఐద్వా ఖండన

పాల ధరలు పెంచడాన్ని ఐద్వా ఒక ప్రకటనలో ఖండించింది. అలాగే రహదారుల టోల్ ట్యాక్స్‌ను ఐదు శాతం పెంచడాన్ని కూడా ఖండించింది. దీనివల్ల నిత్యావసరాల ధరలు పెరుగుతాయని, అంతిమంగా కుటుంబాల బడ్జెట్ దారుణంగా దెబ్బతింటుందని విమర్శించింది. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఇటువంటి చర్యలు తీసుకోవడమంటే ప్రజలను మోసం చేయడమేనని విమర్శించింది. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న మహిళలపై ఈ చర్యలు అదనపు భారాన్ని మోపుతాయని పేర్కొంది. పిల్లలను, మహిళలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఈ పాల ధరలను ఉపసంహరించాలని ఐద్వా డిమాండ్ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామని పేర్కొంది.

వెయిట్ అండ్ సీ

- కాంగ్రెస్ చాలా ఆశాభావంతో ఉన్నది : సోనియా గాంధీ

న్యూఢిల్లీ : దేశంలో ఇప్పటికే వెలువడిన ఎగ్జిట్ పోల్ ఫలితాలపై సోనియా గాంధీ తన మొదటి స్పందనను తెలియజేశారు. ఈ విషయంలో వేచి చూడాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు.. ఎగ్జిట్ పోల్స్‌లో చూపిన దానికి పూర్తి విరుద్ధంగా ఉంటాయని ఆమె అన్నారు. కాంగ్రెస్ చాలా ఆశాభావంతో ఉన్నదని చెప్పారు. మంగళవారం ప్రకటించబోయే ఎన్నికల ఫలితాలపై ఆమె అంచనాల గురించి అడిగినప్పుడు సోనియాగాంధీ పైవిధంగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే భారీ మెజారిటీతో గెలుస్తుందనీ, ప్రధాని మోడీ వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారని చాలా ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన విషయం విదితమే. కాంగ్రెస్, ఇతర ఇండియా బ్లాక్ పార్టీలు ఎగ్జిట్ పోల్స్‌ను తిరస్కరించాయి. ఈ సర్వేలు "కల్పితం" అని పేర్కొంటూ ప్రతిపక్ష ఇండియా వేదిక తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పాయి. " దీనిని ఎగ్జిట్ పోల్ అని పిలవరు. దాని పేరు 'మోడీ మీడియా పోల్' " అని రాహుల్ గాంధీ ఇప్పటికే అభివర్ణించారు. పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా ప్రసిద్ధ పాటను ప్రస్తావిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి 295 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు.

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 100వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సోనియా గాంధీ పాల్గొని మాట్లాడారు. "కళైంజర్ కరుణానిధి 100వ జయంతి సందర్భంగా డిఎంకెకు చెందిన నా సహచరులతో కలిసి ఇక్కడకు రావటం ఆనందంగా ఉన్నది. ఆయనను చాలా సందర్భాలలో కలుసుకునే అదృష్టం కలిగింది. ఆయన చెప్పేది వింటూ.. ఆయన వివేకం, సలహాల నుంచి ప్రయోజనం పొందాను. ఆయనను కలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని సోనియా అన్నారు.

14 పోల్ కోడ్ ఉల్లంఘన కేసుల్లో ఇసి చర్యలు

- బిజెపికి 5, కాంగ్రెస్‌కి 4 నోటీసులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పలు సందర్భాల్లో అందిన 14 మోడల్ ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై ఎన్నికల సంఘం (ఇసి) చర్యలు తీసుకున్నది. దీంతో ఇది 13 నోటీసులు, ఆరు అభిశంసనలు, మూడు తాత్కాలిక ప్రచార నిషేధాలకు దారితీసింది. ఏడు దశల్లో జరిగిన కీలక ఎన్నికల కోసం రెండున్నర నెలల పాటు సాగిన ప్రచారం గతనెల 30తో ముగిసింది. జూన్ 1న తుది దశ ఎన్నికలు పూర్తయ్యాయి. ఇసి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నోటీసులు, ఆదేశాల ప్రకారం.. పోల్ ప్యానెల్ 14 ఎంసిసి విషయాలను నేరుగా చేపట్టింది. వాటిలో 13 విషయాల్లో నోటీసులు జారీ చేసింది. బిఆర్ఎస్ ఫిర్యాదు మేరకు ఇసి ఏప్రిల్ 26న కాంగ్రెస్ నేత, తెలంగాణ మంత్రి కొండా సురేఖకు ఈసీ నోటీసులు జారీ చేసింది. ఇక 14 అంశాల్లో బిజెపి నేతల ఉల్లంఘనలకు సంబంధించినవి ఐదు, కాంగ్రెస్ నేతలపై నాలుగు, టిడిపి, ఆప్, వైసిపి, బిఆర్ఎస్, టిఎంసిలకు వ్యతిరేకంగా ఒక్కొక్కటి ఉన్నాయి. ఈ 14 కేసులలో, మూడు కేసుల్లో ఏదైనా చర్య తీసుకున్నారా అన్నదానిపై మాత్రం ఇసి ఇంకా బహిరంగపరచలేదు. ఏప్రిల్ 5న ఢిల్లీ మంత్రి అతిషికి ఒక నోటీసు, మే 18న బిజెపి పశ్చిమ బెంగాల్ చీఫ్ సుకాంత మజుందార్‌కు రెండు నోటీసులు అందాయి. పార్టీ స్టార్ క్యాంపెయినర్ల ఉల్లంఘనలకు పాల్పడినందుకు పార్టీ అధ్యక్షులకు ఇసి ఈసారి నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 25న, మోడీపై వచ్చిన ఫిర్యాదులపై బిజెపి అధ్యక్షుడు జేపీ నడ్డాకు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేకు ఇసి నోటీసులు జారీ చేసింది. రెండు పార్టీల అధ్యక్షుల నుంచి సమాధానాలు అందుకున్న తర్వాత, ఇసి మే 22న ఎంసిసి నిబంధనలను పునరుద్ఘాటిస్తూ వారికి వివరణాత్మక ఆదేశాలు జారీ చేసింది. ఇక నాయకులను దూషించిన సందర్భాలలో హెచ్చరించటం, ఎంసిసి ఉల్లంఘించిన కేసుల్లో ప్రచారంపై నిషేధం విధించిన ఘటనలూ చోటు చేసుకున్నాయి. కాగా, పోల్ ప్యానెల్, రాష్ట్ర సిఇఒతో పార్టీలు 425 ప్రధాన ఫిర్యాదులు దాఖలు చేశాయని ఈసీ మే 14న ఒక ప్రకటనలో తెలిపింది. వాటిలో 400 కేసుల్లో చర్యలు తీసుకోవటం, పరిష్కరించబడటం జరిగిందని వివరించింది.

ఆ ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలకు హిమాచల్ స్పీకర్ ఆమోదం

షిమ్లా : రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి ఓటు వేసిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల రాజీనామాలను హిమచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా సోమవారం ఆమోదించారు. '14వ విధాన సభలోని ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలను తక్షణ అమలుతో ఆమోదించాం' అని ఇక్కడ విలేకరులకు పఠానియా తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి హర్ష మహజన్‌కు అనుకూలంగా ఆరుగురు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలతో సహా ముగ్గురు స్వతంత్ర్య ఎమ్మెల్యేలు హోసియార్ సింగ్ (డెహ్రా నియోజకవర్గం), అశీష్ శర్మ (హమీర్‌పూర్ నియోజకవర్గం), కెఎల్ ఠాకూర్ (నలగఢ్ నియోజకవర్గం) ఓటు వేశారు. ఈ ముగ్గురు మార్చి 22న రాజీనామా చేశారు. అయితే స్పీకర్ రాజీనామాలను ఆమోదించలేదు. మార్చి 23న వీరు బిజెపిలో చేరారు. రాజీనామాలను ఆమోదించేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ విచారణ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. అలాగే, మరోవైపు ఈ ముగ్గురిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు జగత్ సింగ్ నేగి హైకోర్టులో మరో పిటిషన్ వేశారు. ఇలాంటి నేపథ్యంలో స్పీకర్ వీరి రాజీనామాలను ఆమోదించారు. 'రాజీనామాలను ఆమోదించినా, అనర్హత వేటు వేసినా జరిగేది ఒక్కటే.. వారు అసెంబ్లీలో ఉండరు' అని స్పీకర్ చెప్పారు. స్పీకర్ నిర్ణయాన్ని ఎమ్మెల్యేలు స్వాగతించారు. అయితే ఈ నిర్ణయం మరింత ముందుగా తీసుకుని ఉంటే బాగుండేది అన్నారు. ఎందుకంటే ఆరుగురు కాంగ్రెస్ రెబల్స్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఇప్పటికే వేయడంతో ఈ స్థానాలకు లోక్‌సభ ఏడో దశతో పాటు ఈ నెల 1న ఉప ఎన్నికలు నిర్వహించారు. తమ రాజీనామాలను కూడా ఆమోదించి ఉంటే ఈ స్థానాలకు కూడా ఎన్నికలు జరిగి ఉండేవని అన్నారు.

కాగా, హిమాచల్ ప్రదేశ్‌లో మొత్తం 68 ఎమ్మెల్యే ఉన్నారు. ఆరుగురు కాంగ్రెస్, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల స్థానాలు ఖాళీ అవ్వడంతో అసెంబ్లీలో ప్రస్తుతం 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్‌కు 34 మంది, బిజెపికి 25 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

తాజ్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- మూడు బోగీలు దగ్ధం

న్యూఢిల్లీ : తాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆగ్నేయ ఢిల్లీలోని సరితా విహార్ వద్ద సోమవారం సాయంత్రం 4.24 గంటల సమయంలో మూడు బోగీల్లో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ప్రయాణికులు హుటాహుటిన బయటకు వచ్చేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితమేనని తెలిపారు. ఓఖ్లా - తుగ్లకాబాద్ మధ్య సర్వీసులందిస్తున్న ఈ రైలులో నాన్-ఏసీ చైర్ కార్ డి3 కోచ్ నుంచి ముందుగా మంటలు ఎగసిపడినట్లు నార్తన్ రైల్వే జనరల్ మేనేజర్ శోభన్ చౌదరి తెలిపారు. ఆ తర్వాత మరో రెండు కోచ్‌లకు వ్యాపించాయని పేర్కొన్నారు. అయితే, మంటలు చెలరేగడానికి గల కారణాలు మాత్రం ఇంకా వెల్లడికాలేదు. ఎనిమిది అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో డి3, డి4 కోచ్‌లు మంటల్లో పూర్తిగా దగ్ధం కాగా, .. డి2 కోచ్ మాత్రం పాక్షికంగా దగ్ధమయింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ఇమ్రాన్ ఖాన్, మహ్మద్ ఖురేషి (ఫైల్ ఫోటో)

ఇమ్రాన్, ఖురేషిలకు ఊరట

- సిఫర్ కేసులో నిర్దోషులుగా ప్రకటించిన హైకోర్టు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు, అలాగే ఆ పార్టీ నాయకుడు, మాజీ విదేశాంగ మంత్రి మహ్మద్ ఖురేషికి భారీ ఊరట లభించింది. సిఫర్ కేసులో వీరిరువురిని నిర్దోషులుగా ఇస్లామాబాద్ హైకోర్టు (ఐహెచ్‌సి) ప్రకటించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి అమర్ ఫరూక్, న్యాయమూర్తి జస్టిస్ మియాంగుల్ హస్సన్ ఔరంగజేబ్ సంక్షిప్త తీర్పు చెప్పారు.. 'ఈ ఇద్దరిపై మరే ఇతర కేసులూ లేకపోతే వెంటనే విడుదల చేయవచ్చు' అని కూడా తీర్పులో పేర్కొన్నారు. ఈ ఇద్దరూ వెంటనే విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే ఇమ్రాన్ ఖాన్‌కు ఇద్దత్ కేసులో శిక్ష పడగా, ఇదే కేసులో ఖురేషిని మే 9న అరెస్టు చేశారు. తోషాఖానా కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ఏదిఏమైనా ఇస్లామాబాద్ హైకోర్టు తీర్పుపై పిటిఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన కేసుల్లోనూ ఇమ్రాన్ నిర్దోషిగా బయటపడతాడనే విశ్వాసాన్ని ఒమర్ అయూబ్ వ్యక్తం చేశారు. మరో నాయకులు షిబ్లీ ఫరాజ్ మాట్లాడుతూ ఇద్దరి నాయకుల వెనుక న్యాయం ఉందని అన్నారు. సెనెటర్ అలీ జాఫర్ మాట్లాడుతూ తీర్పు ఆలస్యమైనా, న్యాయం విజయం సాధించిందని అన్నారు. ఇమ్రాన్‌ఖాన్ తరుపు న్యాయవాది సల్మాన్ సఫ్దర్ మాట్లాడుతూ 'ఇమ్రాన్‌ఖాన్ దేశద్రోహి కాదని, ఆయన ఏం చేసినా దేశ ప్రయోజనాల కోసమే' చేశారని చెప్పారు.

భౌతిక స్వాధీనతా ప్రకటన

ICICI Bank | **బ్రాంచి ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడు, 4/10, మైత్రీ టవరు, బొమ్మనుహల్లి హొసూరు మెయిను రోడ్డు, బెంగళూరు-560068.

ఏదైతే,

క్రింది సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్& ఎన్ఫోర్సుమెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండు నోటీసులు జారీచేసి, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

ఆ విధంగా రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని క్రింది సంతకందారు ఇందు దిగువ పేర్కొన్న తేదీలలో స్వాధీనంచేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కు చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	రూబీన్ మనయాన/ శ్రీమతి మన్యాల శ్యామల, **LBVJW00005419346/ LBVJW00005460309**	1) **ఆస్తి యొక్క షెడ్యూలు-ఎ- షెడ్యూలు ఐటెం నం.1**: గుంటూరు జిల్లా, గుంటూరు జిల్లా రిజిస్టర్ పరిధుల్లో, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్ ఏరియా, తాడెపల్లి మండలం, కొలనుకొండ గ్రామపంచాయతి, కొలనుకొండ గ్రామంలో, ఎక.0-28 సెంట్లకుగాను ఎక.0-58సెంట్లు గల డోర్ నం.81/1, ఎక.0-28సెంట్లకుగాను ఎక.0-58 సెంట్లలో డోర్ నం.81/2, పూర్తి విస్తీర్ణం ఎక.0-56 సెంట్లు లేదా 2710.4చ.గ.ల ల్యాండ్ ఇంటి సైటు. సరిహద్దులు: తూర్పు: షేక్ మహ్మద్ షరీఫ్ ఆస్తి, దక్షిణం: గుట్టెన రాధాకృష్ణ ఆస్తి, పడమర: కొలనుకొండ-ఇప్పటం వ్యవసాయ పంట కాలువ, ఉత్తరం: ఎం. నారాయణ మూర్తి & చిత్తారి బాబ్జి ఆస్తులు మరియు **ఐటెం నం.2లో ఆస్తి:** పై సరిహద్దుల మధ్య 2710.4చ.గ.లు లేదా 2266.16చ.మీ.ల విస్తీర్ణంలో సైటు. **ఐటెం నం.2**: గుంటూరు జిల్లా, గుంటూరు జిల్లా రిజిస్టర్ పరిధుల్లో, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్ ఏరియా, తాడెపల్లి మండలం, కొలనుకొండ గ్రామపంచాయతి, కొలనుకొండ గ్రామంలో, డోర్ నం. 82/11, లో 142.25చ.గ.ల సైటు. డోర్ నం.82/12, 250.5చ.గ.ల విస్తీర్ణంలో సైటు 82/14లో 40 పూర్తి విస్తీర్ణం ఎక.432.75చ.గ.లు దీని సైటు, ఏదైతే తూర్పు వైపు సైటు యొక్క 80చగ..లు. సరిహద్దులు: తూర్పు: షేక్ మహ్మద్ షరీఫ్ ఆస్తి, దక్షిణం: ఈ షెడ్యూలు ఆస్తి యొక్క ఐటెం నం.1 ఆస్తి, పడమర: చిత్తారి బాబ్జి ఆస్తి, ఉత్తరం: లేఔట్ ప్లాన్ నం. 5/2010 ప్రకారం ప్లాట్ నం.53 కొంత విస్తీర్ణం మరియు 40అ.ల వెడల్పు రోడ్డు కొంత విస్తీర్ణం, పూర్తి విస్తీర్ణం ఐటెం నం.1& 2 యొక్క విస్తీర్ణం 2790.4చ.గ.లు సైటు లేదా 2333.5చ.మీ.లు సైటు, **బి-షెడ్యూలు**: సి.ఆర్.డి.ఎ. ఆమోదిత ఫైల్ నం.1168/0842/బి/టిడిపిఎల్ఇ/కెఎన్‌డిఎ/2017/విజెఎ, ఎ-షెడ్యూలు సి.ఎం. డెవలపర్స్ విజయవాడ లో నిర్మించిన ఏదైతే సి.ఎం. హైబిటేట్స్ అపార్టుమెంట్ లో ఫ్లాట్ నం.1 గా దాని గ్రౌండ్ ఫ్లోర్‌లోగల ఫ్లాట్‌తోపాటు 44.26చ.గ.లు లేదా 37.00చ.మీ.ల విస్తీర్ణపు హక్కుల విడదీయలేని, సూచించజాలని ఉమ్మడ వాటా సైటు. సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి కారిడార్, దక్షిణం: డక్ట్, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై. పై నాలుగు సరిహద్దుల మధ్య 1000చ.అ.ల ప్లింత్ ఏరియా మరియు ఉమ్మడి ఏరియా, 120చ.అ.ల స్కూటర్& కార్ పార్కింగ్ ఏరియా, అన్ని ఈజిమెంటరీ హక్కులుతో పూర్తిగా 1120చ.అ.లు, భౌతిక స్వాధీనతా తేది: 30.05.2024.	**30/08/2021 రూ.33,84,736/-**	విజయవాడ

పై పేర్కొన్న రుణగ్రహీతలు/ హామీదారులు, ఇందుమూలంగా మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా ఇందుమూలంగా, 30 రోజుల ప్రకటన ఇవ్వబడుచున్నది, లేనిచో తాకట్టుపెట్టిన ఆస్తులను సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన తరువాత విక్రయించబడుతుంది.

తేది: జూన్ 04, 2024
ప్రదేశం: విజయవాడ (గుంటూరు)

సం/- అధీకృత అధికారి,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున.

జీవన సౌరభం

తెలివిగలవారు ఎప్పుడూ వైఫల్యం పొందిన చోట నుంచే విజయం సాధించడం ప్రారంభిస్తారు.



జలం జీవనాధారం

జలం జీవనాధారం
కులం మతం లేనిది
ప్రతి మనిషికి అవసరమైనది
చెట్టుకు పుట్టకు ఆధారం
ప్రతి జీవికి ప్రాణ పదం
నింగి నేల అంతటా అవసరం
కొరత వస్తే అనర్థం
అధికమైతే అపాయం
ప్రతి బొట్టు ఒడిసిపట్టు
రాబోవు తరాన్ని నిలబెట్టు
సజీవం నీటి ఆధారం
నీబతుకు నీటితో మమేకం
జాగ్రత్త సుమా
నీటిని వృధా చేయొద్దు!

– వై.వి.ఆర్.ప్రిన్స్,
జూనియర్ ఇంటర్,
ఆకాశ్ జూనియర్ కాలేజీ,
కడప.

అమ్మమ్మ ఊరు వెళ్లానోచ్!

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు ప్రవళిక. ఎనిమిదో తరగతి చదువుతున్నాను. మా ఊరు రాజమండ్రి. ప్రతిసారి వేసవికాలం సెలవులకు, నేను మా అమ్మమ్మ ఊరు భీమవరంలోని యనమదుర్రు వెళ్తాను. ఈ ఊరు భీమవరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ఊర్లో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. పురాతన కాలం నాటి ఆలయం, పెద్ద చెరువు గురించి ఇప్పటికీ ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. అలాగే యనమదుర్రు డ్రైన్ కూడా చాలా ఫేమస్ అని మా మామయ్య చెప్పారు. అపార్ట్మెంట్లో ఉంటున్న నాకు మా అమ్మమ్మ గారి ఇంట్లో ఉన్న విశాలమైన ప్రాంగణంలో ఆడుకుంటుంటే ఆ ఆనందం వేరు. మా అమ్మమ్మ గారి ఇంటి చుట్టూ పచ్చని పొలాలు ఉన్నాయి. పొద్దున్నే నిద్ర లేచిన వెంటనే ఆవులు, గేదెలు పలకరిస్తూ ఉంటాయి. అమ్మమ్మ ఇంటి చుట్టుపక్కల వాళ్ళు కూడా నన్ను ఆప్యాయంగా పలకరిస్తూ ఉంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. నేను, మా పెద్దమ్మ పిల్లలు అందరం కలిసి ఈ సెలవుల్లో బాగా అల్లరి చేశాం. సెలవులన్నీ ఇట్టే గడిచిపోయాయి. మళ్లీ తిరిగి రావాలంటే విపరీతమైన బెంగ, ఏడుపు వచ్చేశాయి.

ప్రవళిక, 4వ తరగతి, రాజమండ్రి.

బొమ్మరిల్లు

పి.ఉమామహేశ్వరి,
9వ తరగతి,
ఎం.తిమ్మాపురం
ఆదర్శ పాఠశాల,
మహానంది,
నంద్యాల జిల్లా.

ఆర్. శ్రీ కుషాల్ నాయక్,
6వ తరగతి,
ఒంగోలు,
ప్రకాశం జిల్లా.



కె. జాస్మి శ్రీ కార్తి,
5వ తరగతి,
శ్రీ చైతన్య స్కూలు, నర్సాపూర్



ఎన్.దీక్షిత,
5వ తరగతి,
టింపని స్కూలు
(నౌపడ),
విశాఖపట్నం.

వానాకాలం పిల్లల ఆరోగ్యం కోసం ...

వాతావరణం మారుతోంది. వర్షాలు ప్రారంభమయ్యాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. జ్వరం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, పొత్తికడుపు ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలతో పిల్లలు ఈ కాలంలో చాలా ఇబ్బందిపడతారు. ఈ వర్షాకాలంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు అనుసరించాల్సిన పరిశుభ్రత, జాగ్రత్తల గురించి పెద్దలకు కచ్చితమైన అవగాహన ఉండాలి.

పాటించాల్సిన నియమాలు..

- శుద్ధి చేసిన తాగునీరు లేదా మరగించి చల్లార్చిన నీరు తాగేలా చూడాలి.
- మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధుల వ్యాప్తిని నివారించేలా పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.
- ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా తడి బట్టలు, బూట్లు తప్పనిసరిగా ఆరుబయట ఆరబెట్టాలి.

- భోజనానికి ముందు చేతులు బాగా కడుక్కునేలా చూడాలి.
- స్కిప్పింగ్, హోపింగ్, టేబుల్ టెన్నిస్ మొదలైన ఇండోర్ ఫిజికల్ యాక్టివిటీస్ వంటి శారీరక శ్రమ కలిగించే క్రీడలను ప్రోత్సహించాలి.
- ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ తగ్గించాలి.
- శరీరంపై టాల్కమ్ పౌడర్ రాసుకోవాలి.
- వర్షాలు పడుతున్న సమయంలో తప్పనిసరిగా బయటికి వెళ్తున్నప్పుడు రెయిన్‌కోట్‌లు, గొడుగులు, గమ్ బూట్లు ఉపయోగించాలి.
- ఆహారంలో తులసి, దాల్చిన చెక్క, నిమ్మ, అల్లం, ఇతర మసాలా దినుసులు చేర్చాలి.
- పొడవాటి చేతులు ఉన్న దుస్తులు, పూర్తి పొడవు కలిగిన ప్యాంటులను వేసుకునేలా చూడాలి.
- దోమలు కుట్టకుండా దోమతెర ఉపయోగించాలి.
- బయటి నుండి వచ్చిన పిల్లల కాళ్లను గోరువెచ్చని నీళ్లతో కడగాలి.
- ప్లాస్టిక్, కాన్వాస్ లేదా లెదర్ బూట్లు ధరించవద్దు. సాధారణ చెప్పులు ధరించేలా చూడాలి.
- అలెర్జీలు రాకుండా ఇంటి వాతావరణంలో తేమ లేకుండా చూడాలి. ముఖ్యంగా గోడలు, తివాచీలు, కర్టెన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.

వేడి నీళ్లు.. ఎన్నో లాభాలు ...

వర్షాలు పడుతున్నాయి, ఎండా కాస్తుంది. ఇటువంటప్పుడు ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ తీసుకోవాలి. ఇలాంటప్పుడు ఆహారంతో పాటు నీటిని తీసుకోవడంలో కూడా తగు జాగ్రత్తలు పాటించాలి. తాగే నీళ్లు వేడిచేయడం వల్ల కంటికి కనిపించని క్రిములు, కీటకాలు నశించిపోతాయి. జలుబు, దగ్గు, జ్వరాలు రావు.

- చల్లని వాతావరణం ఉన్నప్పుడు గోరువెచ్చటి నీళ్లు తాగితే శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యి బద్ధకం తగ్గి యాక్టివ్‌గా మారుతుంది. చలి, వణుకు లాంటి లక్షణాలు ఏమైనా ఉంటే ఇట్టే తగ్గిపోతాయి.
- అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారు రోజు వేడి నీరు తాగితే శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.
- ఆడవాళ్లకు నెలసరిలో వచ్చే అనేక సమస్యలు గోరువెచ్చటి నీళ్లతో పరిష్కారమవుతాయి. ఆ సమయంలో కలిగే విసుగూ అలసటా తగ్గుతాయి. పీరియడ్స్ టైమ్‌లో వచ్చే కడుపు నొప్పి నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. మొటిమలు రావు. చుండ్రు రాదు. జుట్టు రాలదు, కుదుళ్లు బలపడతాయి.
- వేడి నీళ్లతో అవయవాలన్నీ ఉత్తేజితమవుతాయి. జీర్ణప్రక్రియను వృద్ధిచేసి మలబద్ధక సమస్యను నివారిస్తాయి. కడుపు నొప్పి, అజీర్తి జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
- వేడినీళ్లు తాగితే.. నరాల పనితీరు మెరుగుపడుతుంది. రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది. శరీరంలో మలినాలన్నీ వెళ్లిపోతాయి.
- వేడి నీళ్లు తాగితే దంతాల్లో ఇరుక్కుపోయిన క్రిములు చచ్చిపోయి దంత సమస్యలు తగ్గుతాయి.
- కీళ్ల నొప్పులతో బాధపడేవారు వేడి నీళ్లు తాగితే, ఆర్థరైటీస్ సమస్యలు తగ్గుతాయి. శరీరం పొడిబారదు. ముఖం కాంతిమంతంగా ఉంటుంది.

సింక్ శుభ్రత ఇలా ...



చాలామంది కిచెన్ సింక్‌లో అనేక రకాల పాత్రలు, పదార్థాలను రాత్రంతా అలాగే ఉంచేస్తారు. దీనివల్ల సింక్ నుంచి ఒకరకమైన వాసన వస్తుంది. ఆయా పదార్థాల్లో ఉండే బ్యాక్టీరియా అంతా సింక్‌లో పేరుకుపోవడమే ఈ దుర్వాసనకు కారణం. వాసన పోయేందుకు చాలామంది అనేక రసాయన ఉత్పత్తులను ఉపయోగిస్తారు. అయితే ఇది ఆరోగ్యాన్ని చాలా చేటు చేస్తుంది. దానికి బదులుగా సహజ ఉపత్పత్తులతోనే సింక్‌ను శుభ్రం చేసుకోవొచ్చు.

వేడి నీరు, బ్లీచ్

వేడి నీటిలో కొంచెం బ్లీచింగ్ పౌడర్ వేసి ఆ నీటితో సింక్ శుభ్రం చేసుకోవచ్చు.

వెనిగర్, నిమ్మకాయ

నిమ్మరసం, వెనిగర్ మిశ్రమాన్ని సింక్‌లో పోసి, అరగంట అలాగే వదిలేయాలి. ఆ తర్వాత నీళ్ళతో శుభ్రం చేయాలి.

వంట సోడా

సింక్ బ్లాక్ అయితే వంట సోడాను వేసి కాసేపు అలాగే ఉంచాలి. ఆ తర్వాత కడిగేస్తే సింక్ రంధ్రాలు శుభ్రపడతాయి.

వేప ఆకు

కొన్ని వేప ఆకులను నీటిలో వేసి మరిగించి ఈ నీటిని సింక్‌లో వేయాలి. కొంత సేపటి తర్వాత సబ్బు నీటిని ఉపయోగించి సింక్‌ను స్క్రబ్ చేస్తే, సింక్ శుభ్రపడుతుంది.

దసరా బరిలో రజనీ మూవీ



వచ్చే దసరాకు సినిమాలు రెడీ అవుతున్నాయి. రజినీకాంత్ నటించిన 'వెట్టయ్యాన్' అక్టోబర్ 10న విడుదలవుతుందని సమాచారం. ఈ సినిమాకి టిజె జ్ఞానవేల్ దర్శకుడు, సుభాస్కరన్ నిర్మాత. అమితాబ్ బచ్చన్ ఒక ప్రముఖ పాత్ర పోషిస్తుండగా, మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్‌లో ముఖ్య పాత్రల్లో కనపడనున్నారు. జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న 'దేవర' సినిమా కూడా అక్టోబర్ 10న విడుదల కానుంది. శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా, హిందీ నటుడు సైఫ్ అలీ ఖాన్ విలన్‌గా నటిస్తున్నారు.

5న 'ధూం ధాం' ఫస్ట్ సింగిల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా రూపొందిస్తున్నామని దర్శకుడు సాయి కిషోర్ మచ్చా తెలిపారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఫస్ట్ లిరికల్ సాంగ్ 'మల్లెపూల టాక్సీ' ప్రోమో రిలీజ్ చేశారు. ఈ పాట పూర్తి వీడియోను ఈ నెల 5వ తేదీ ఉదయం విడుదల చేయనున్నారు. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, గోపీ సుందర్ కంపోజ్ చేశారు. గానం : మంగ్లీ.

సూర్యకు జోడీగా పూజా హెగ్డే

నటుడు సూర్య ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ, స్టోన్ బెంచ్ సంస్థ కలిసి నిర్మిస్తున్నాయి. ఇందులో సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. ఇది ఆయన నటిస్తున్న 44 చిత్రం అవుతుంది. షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. సూర్యకు జంటగా పూజా హెగ్డే నటిస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. తొలి షెడ్యూల్ అండమాన్‌లో నిర్వహించనున్నట్లు సమాచారం.

'కల్కి'కి పోటీగా 'ఇంద్రాణి'

ప్రభాస్ నటించిన 'కల్కి' సినిమా ఈనెల 27న విడుదల కానుంది. ఇప్పటికే గ్లిమ్స్, టీజర్లు విడుదలయ్యాయి. ఈ చిత్రంలో ముఖ్య భూమిక పోషిస్తున్న 'బుజ్జి' అనే కారుకు సంబంధించిన వీడియోను విడుదలై, ఆదరణ పొందింది. సూపర్ ఉమెన్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఇంద్రాణి – ఎపిక్ 1: ధరమ్ వర్సెస్ కరమ్'. యానీయా ప్రధాన పాత్రలో నటిస్తోండగా కబీర్ సింగ్ ఈ చిత్రంలో సూపర్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను చూస్తే కల్కి సినిమాతో చాలా సారూప్యతలు ఉన్నట్లు తెలుస్తోంది. కల్కి 2898లో బుజ్జి అనే రోబో ఉన్నట్లే ఈ సినిమాలో చిట్టి అనే తరహా రోబో కూడా ఉంది. 2021 ఏడీ అంటూ కథాకాలాన్ని సమయాన్ని కూడా చూపించారు. ఇలా కొన్ని పోలికలు ఈ రెండు సినిమాల మధ్య కనిపిస్తున్నాయి. ఈ చిత్రం ఈనెల 14న విడుదల కానుంది.

త్వరలో హీరామండి -2

'హీరామండి: ది డైమండ్ బజార్' వెబ్ సిరీస్ మే 1న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. తెలుగులోనూ మంచి ఆదరణే లభించింది. ఈ సిరీస్‌కు ఎక్కువగా పాజిటివ్ రివ్యూలే వచ్చాయి. త్వరలో రెండో సీజన్ కూడా విడుదల కానుందని తాజాగా మేకర్స్ ప్రకటించారు. బాలీవుడ్‌లో టాప్ డైరెక్టర్‌గా పేరున్న సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన ఈ వెబ్‌సిరీస్‌లో మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, అదితిరావు హైదరి, షర్మిన్ సెగల్, సంజీదా షేక్ వంటి తారలు నటించి మెప్పించారు. తాజాగా సీజన్ –2ను త్వరలో విడుదల చేస్తామని సోషల్ మీడియా ద్వారా నెట్‌ఫ్లిక్స్ తెలిపింది.

హనీమూన్ ఎక్స్‌ప్రెస్ టైటిల్ సాంగ్ విడుదల

చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఎన్ఆర్ఐ ఎంటర్‌టైన్మెంట్ (యుఎస్ఎ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై కె.కె.ఆర్, బాల రాజ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి బాల రాజశేఖర్ దర్శకుడు. కళ్యాణి మాలిక్ సంగీతం అందించారు. ఇప్పటికే హనీమూన్ ఎక్స్‌ప్రెస్ చిత్రం నుంచి మూడు పాటలు విడుదలై ఆకట్టుకున్నాయి. ఆదివారం నాడు ఈ చిత్రంలోని టైటిల్ ట్రాక్‌నుదర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు విడుదల చేశారు. 'దర్శకుడు బాల అమెరికాలో చాలా మందికి సినిమా గురించి శిక్షణ ఇచ్చి తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్‌లో డీన్‌గా పనిచేశాడు. ఇప్పుడు సొంత డైరెక్షన్‌లో ఈ చిత్రాన్ని నిర్మించారు. పాప్ సింగర్ స్ఫూర్తి జితేందర్ ఈ టైటిల్ పాటను స్వరపరచి ఆలపించింది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి' అని రాఘవేంద్రరావు అన్నారు.

'సూపర్' నమీబియా

- ఉత్కంఠ పోరులో ఒమన్‌పై గెలుపు
- టి20లో రూబెన్ రికార్డు

బార్బొడాస్: టి20 ప్రపంచకప్‌లో నమీబియా సంచలనం సృష్టించింది. ఐసిసి టి20 ప్రపంచకప్‌లో సూపర్ ఓవర్‌లో ఒమన్‌పై సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. గ్రూప్–బిలో భాగంగా సోమవారం బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవర్ మైదానం వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో టైగా ముగియడంతో సూపర్ ఓవర్‌కు దారి తీసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 19.4 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌట్ అయింది. 110 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 6 వికెట్లు నష్టపోయి 109 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ టై అవడంతో సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో నమీబియా వికెట్ నష్టపోకుండా 21 పరుగుల చేసింది. అనంతరం ఒమన్ వికెట్ నష్టపోయి 10 పరుగులే చేసి ఓటమిపాలైంది. దీంతో నమీబియా ఉత్కంఠభరిత విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సూపర్ ఓవర్ వేసిన నమీబియా బౌలర్ వైస్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఆఫ్ఘనిస్తాన్ × ఉగాండా వేదిక: గయానా; ఉ.6.00గం॥లకు
ఇంగ్లండ్ × స్కాట్లాండ్ వేదిక: బార్బొడాస్; రా.8.00గం॥లకు
నెదర్లాండ్స్ × నేపాల్ వేదిక: డల్లాస్; రా.9.00గం॥లకు

రూబెన్ రికార్డు..

నమీబియా పేసర్ రూబెన్ ట్రంపెల్‌మాన్ రికార్డు పుటల్లోకెక్కాడు. ఒమన్‌పై తొలి 2బంతుల్లో 2వికెట్లు తీశాడు. తొలి బంతికి ఓపెనర్ ప్రజాపతి, ఆ మరుసటి బంతికి కెప్టెన్ అకిబ్ ఇలియాస్‌లను పెవీలియన్‌కు పంపించాడు. ఇద్దరినీ గోల్డెన్ డకౌట్ చేశాడు. ఈ విధంగా టీ20 క్రికెట్‌లో ఇన్నింగ్స్ ఆరంభ తొలి రెండు బంతుల్లో రెండు వికెట్లు తీసిన తొలి నమీబియా ఆటగాడిగా రూబెన్ ట్రంపెల్‌మాన్ నిలిచాడు. టి20ల్లో ఈ విధంగా జరగడం ఇదే తొలిసారి.

క్వార్టర్స్‌కు సబలెంక, రైబకినా

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి 2వ సీడ్ సబలెంకా, 4వ సీడ్ రైబకినా ప్రవేశించారు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్స్ పోటీల్లో సబలెంక (బెలారస్) 6–2, 6–3తేడాతో నవ్వారో (అమెరికా)ను, ఎలేనా రైబకినా(కజకిస్తాన్) 6–4, 6–3తో స్విటోలినా(ఉక్రెయిన్)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరారు. మరో పోటీలో 12వ సీడ్ పోలిని(ఇటలీ) 4–6, 6–0, 6–1తో అవనేషియాన్(రష్యా)ను చిత్తుచేసి క్వార్టర్స్‌కు చేరింది.

మెద్వదెవ్ ఔట్..

పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 5వ సీడ్, రష్యాకు చెందిన డానియెల్ మెద్వదెవ్ పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో 11వ సీడ్ డి–మెనర్ 4–6, 6–2, 6–1, 6–3తో మెద్వదెవ్‌ను ఓడించాడు. మరో పోటీలో 2వ సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, 5వ సీడ్, రష్యాకు చెందిన డానియేల్ మెద్వదెవ్ ప్రవేశించారు. సిన్నర్ 2–6, 6–3, 6–2, 6–1తో మెరెటిన్ మెటిట్ (ఫ్రాన్స్)పై నాలుగుసెట్ల హోరాహోరీపోరులో నెగ్గాడు.

క్వార్టర్స్‌కు బొప్పన్న–ఎబ్డెన్..

పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి 2వ సీడ్ రోహన్ బొప్పన్న–మాథ్యూ ఎబ్డెన్ జోడీ ప్రవేశించింది. సోమవారం జరిగిన 2వ రౌండ్ పోటీలో భారత్–ఆస్ట్రేలియా జంట 6–7(2–7), 6–3, 7–7(10–8)తో అన్‌సీడెడ్ బాలాజీ–రెయర్స్ జంటను ఓడించారు. క్వార్టర్స్‌లో బొప్పన్న–ఎబ్డెన్ జంట 10వ సీడ్ బల్గేరియాకు చెందిన జిల్లే–వెలేజిన్‌లతో తలపడనున్నారు.

అర్జున్‌కు 4వ ర్యాంక్

- టాప్–10లో గుకేశ్, ప్రజ్ఞానందకు చోటు
- ఫిడే ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: ఫిడే చెస్ ర్యాంకింగ్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు సత్తా చాటారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) సోమవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఏకంగా నలుగురు గ్రాండ్ మాస్టర్లు టాప్–10లో చోటు దక్కించుకున్నారు. ఎరిగాసి అర్జున్ 2771.2 రేటింగ్ పాయింట్లలో ఏకంగా టాప్–4లో నిలిచాడు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఛాంపియన్‌షిప్‌గా నిలవడంతో అర్జున్ ఏకంగా 14స్థానాలు మెరుగుపరుచుకొని టాప్–4లో నిలిచాడు. ఇక టాప్‌లో మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే) ఉండగా.. అమెరికాకు చెందిన హికారు నకమురా, ఫాబినో కరునా టాప్–3లో ఉన్నారు. కార్ల్‌సన్ 2830.9పాయింట్లతో ఫిడే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక దొమ్మరాజు గుకేశ్(2763) 7వ స్థానంలో నిలువగా.. ఆర్. ప్రజ్ఞానంద(2755) 10వ ర్యాంక్‌లో ఉన్నాడు. విశ్వనాథన్ ఆనంద్(2751) 11వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇక 14ఏళ్ల అర్జున్ ఎరిగాసి భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన 52వ ఆటగాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించి భారత్ తరఫున విశ్వనాథన్ ఆనంద్ తర్వాత 4వ ర్యాంక్‌లో నిలిచిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు.

దక్షిణాఫ్రికా గెలుపు

- నోర్జ్టే దెబ్బకు శ్రీలంక ధమాల్
- టి20ల్లో అత్యల్ప స్కోర్



న్యూయార్క్: టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జట్టు బోణీ కొట్టింది. న్యూయార్క్‌లోని నాసా కౌంటీ స్టేడియంలో శ్రీలంకపై ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 19.1ఓవర్లలో 77పరుగులకే ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు 16.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ డికాక్(20), క్లాసెన్(18నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. అంతకుముందు దక్షిణాఫ్రికా పేసర్ నోర్జ్టే(4/7), రబడా(2/21), మహరాజ్(2/22) దెబ్బకు శ్రీలంక జట్టు 77పరుగులకే కుప్పకూలింది. కుశాల్ మెండీస్(19), మాథ్యూస్(16), కమిందు మెండీస్(11) రెండంకెల స్కోర్ చేశారు. టి20లో లంక జట్టుకు ఇదే అత్యల్ప స్కోర్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నోర్జ్టేకు లభించింది.

టీమిండియా ఆటగాడు కేదార్ జాదవ్ క్రికెట్ అన్ని ఫార్మాట్‌లనుంచి వైదొలుగుతున్న సోమవారం ట్విటర్(ఎక్స్) ప్రకటించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68